
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
ఆదివారం 21 ఏప్రిల్ 2024 | 5





టీడీపీ, జనసేన జెండాతో పవన్ అభివాదం

ఎన్నికల ప్రేమ!

నాడు.. నేను విన్నాను.. నేను చూశాను.. నేను ఉన్నాను అన్నావ్.. నువ్వు చెప్పినదంతా నిజమే అనుకున్నాం.. ఓట్లేసి గెలిపించాం.. నువ్వు చూసిందేంటి జగనన్నా.. నువ్వు విన్నదేంటి జగనన్నా..!? మా కష్టాలు.. కన్నీళ్లు నీకెందుకు..! మాకు ఏదో చేస్తానన్నావ్.. ఎంతో చేస్తానన్నావ్.. తీరా చూస్తే అందరితో కలిపేశావ్.. పథకాలన్నీ ఎత్తేశావ్.. పింఛన్లు పెంచలేదు.. మాకు మాటరాదు.. చూపులేదు.. కాళ్లులేవు.. ఎందుకంటే మేం దివ్యాంగులం.. ఏ పనీచేయలేం.. నువ్వు ఇచ్చే దాంతో ఎలా బతుకుతామనుకున్నావ్.. ఐదేళ్ల తరువాత మళ్లీ ఇప్పుడు వచ్చేసి ఓట్లు ఎలా అడుగుతున్నావ్ జగనన్నా.. ఎక్కడ చూసినా.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎటు చూసినా ఇదీ దివ్యాంగుల ప్రశ్న..!?



పాదయాత్రలో దివ్యాంగుడి సమస్యలు వింటున్న జగన్(ఫైల్)

ఏం విన్నావ్.. ఏం చూశావ్!

జగన్ సర్కారులో.. దివ్యాంగులూ విలపింఛన్

దివ్యాంగుల పెన్షన్ పెంచింది చంద్రబాబే..



దివ్యాంగులకు పెన్షన్ మంజూరు చేసింది టీడీపీయే. దివ్యాంగుల పెన్షన్ రూ.3 వేలకు పెంచి ఇచ్చిన ఘనత చంద్రబాబుదే. పెన్షన్ పెంచాలని జగన్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో దివ్యాంగులకు సబ్సిడీ రుణాలిచ్చారు. జగన్ ప్రభుత్వం ఒక్క సబ్సిడీ రుణం అందించలేదు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ అందిస్తామని ప్రకటించడం శుభపరిణామం.
కేఎస్‌వీ.నాగరాజు, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకుడు, కోనసీమ

- దివ్యాంగులపై చిన్నచూపు
- 3 జిల్లాల్లో 2.56 లక్షల మంది
- పథకాలన్నీ కట్ చేసిన జగన్
- సంక్షేమం గాలికొదిలేశారు
- ఐదేళ్లగా అందని సాయం
- నేటికీ రూ.3 వేల పెన్షనే..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/ (రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)/పిఠాపురం/పిఠాపురం రూరల్ : వారంతా దివ్యాంగులు..అందుకే వారిని అణగదొక్కినా గొంతెత్తలేరనుకున్నట్టున్నారు.. అందుతున్న పథకాలను ఆపేస్తే అడగలేరనుకున్నారు.. ఇచ్చే ప్రోత్సాహకాలకు కత్తెర వేస్తే కన్నెర్రజేసేవారు లేరనుకున్నారు.. స్వయం ఉపాధిని ప్రోత్సహించి వారికి మెరుగైన జీవితం కల్పించకపోయినా నిలదీసే దిక్కె వరు అనుకున్నారు. అందుకే జగన్ పాలనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2.56 లక్షలమం ది దివ్యాంగులు సమిధలుగా మారారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో పూర్తిగా నయవంచనకు గుర య్యారు. అంతకు ముందు చంద్రబాబు పాలనలో అందుతున్న సంక్షేమం మొత్తాన్ని నీరు గార్చేశారు.వారికి అందే ప్రతి పథకానికి పాతరేసేశారు. వెరసి దివ్యాంగుల సంక్షేమంతో ఆటలాడుకున్నారు. పింఛన్లను ఒక్కపైసా పెంచలేదు.రుణాల్లో రాయితీలను ఎత్తేశారు. కల్యాణమస్తు లబ్ధిదారుల సంఖ్యలోనూ కోత పెట్టేశారు. ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషను కాగితాలకే పరిమితమైంది. చివరికి వారి ఉపాధికి ఊతకర్ర సాయం కూడా జగన్ చేయలేదు.అధికారంలోకి వచ్చాక మీ అన్న మిమ్మ ల్ని అన్ని విధాలుగా ఆదుకుంటాడని గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీకి అంగవైకల్యం పట్టుకొంది.

పింఛన్.. వంచన..

వైసీపీ ప్రభుత్వం దివ్యాంగులకు సకలాంగులతో సమానంగానే పింఛను ఇస్తోంది తప్ప ఒక్క పైసా పెంచలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా రూ.3 వేల పెన్షన్ ఇచ్చేశారు. నేటికీ అదే పెన్షన్ ఇస్తున్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క పైసా కూడా పెంచలేదు. ఇంటి స్థలం ఉన్నా, 300 యూనిట్ల కరెంటు బిల్లు వచ్చినా పింఛన్లు కట్ చేశారు. దివ్యాంగత్వం రాకముందు ఆస్తులు ఉంటే వాటినీ పరిగణనలోకి తీసుకొని పింఛన్లు పీకేశారు. విద్యుత్ వినియోగం, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి, ఆదాయపు పన్ను చెల్లించడం, 3 ఎకరాలకు మించి వ్యవసాయ భూమి, నాలుగు చక్రాల వాహనం, పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు వంటి షరతులను విధించి దివ్యాంగుల్లోని చేయూత లబ్ధిదారులను వడ పోశారు. దీంతో చాలా మంది దివ్యాంగుల జీవితాలు చిన్నాభిన్న మయ్యాయి.
గత ప్రభుత్వంలో 'సదరం' సర్టిఫికెట్లు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పొందే అవకాశం ఉండేది.ఈ ప్రభుత్వం దాన్నీ జటిలం చేసేసింది. సదరం కోసం దివ్యాంగులు మీసేవ కేంద్రాలు, కంప్యూటర్ సెంటర్లు, సదరం క్యాంపులు, అధికారుల కార్యాలయాల చుట్టూ అతికష్టంపై తిరగడమే సరిపోతోంది.

ఐదేళ్లలో ఇచ్చింది 210 వాహనాలే

గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలోని 2.65 లక్షల మంది దివ్యాంగులకు వారి చదువులను బట్టి ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ కింద రూ.34 వేల నుంచి రూ.50 వేల వరకు ఉపకార వేతనాలు అందించేది.కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక బటన్ నొక్కుడు కిందకు చేర్చి కోతలు కోసేసింది. దివ్యాంగులకు చంద్రబాబు ప్రభుత్వంలో ఐదేళ్లలో కోతలు లేకుండా ద్విచక్ర వాహనాలను వేలల్లో అందించింది.కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్లలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కేవలం 210 మాత్రమే వాహనాలు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఇందు లోను అధికార పార్టీ నేతల సిఫార్సులు ఉన్న వారికే..ఆమ్యామ్యాలు పుచ్చుకుని అందించారు.

ఉద్యోగాల కల్పనేది..

వికలాంగ రిజర్వేషన్ కేటగిరిలో ఉన్న ఉద్యోగాల భర్తీ మాటే మరిచిపోయారు. పీహెచ్ కోటాలో బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి గత ప్రభుత్వ హయాంలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ నిర్వహించి ఉద్యోగాలను భర్తీ చేసేవారు. వైసీపీ ప్రభుత్వం ఈ విషయాన్నే విస్మరించింది. ఉద్యోగాల ప్రత్యేక భర్తీని చేపట్ట లేదు. కొవిడ్ సమయంలో వికలాంగులను ప్రత్యేకంగా ఆదుకునేందుకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు గురైంది.

రాయితీలు ఎక్కడ?

దివ్యాంగులను ఎవరైనా సాధారణ వ్యక్తులు వివాహం చేసుకుంటే వివాహ ప్రోత్సాహక బహు మతి కింద చంద్రబాబు ప్రభుత్వం లక్ష బహుమతి అమలు చేసింది. వివాహమైన ఏడాదిలోపు ఎప్పు డైనా దరఖాస్తు చేసుకునే వెసులు బాటు కల్పించింది. కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ నిబం ధనను ఎత్తేసి వివాహమైన 15 రోజుల వ్యవధిలో మాత్రమే దరఖాస్తు నిబంధన పెట్టి వారి ఉసురు తీసింది. దివ్యాంగుల్లో అర్హులకు రూ.లక్ష సబ్సిడీని టీడీపీ ప్రభుత్వం అందించి స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తే జగన్ సర్కారు వచ్చాక అవన్నీ ఎత్తేసింది.జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో దివ్యాంగులకు తక్కువ ఒత్తిడి ఉన్న పనులనే కల్పించాలి. తక్కువ సమయం పనిచేసినా పూర్తి వేతనం చెల్లించాలి. అసలు పనిలోకే రావొద్దంటూ దివ్యాంగులను పని ప్రదేశాల నుంచి ఉపాధి అధికారులు పంపివేస్తున్నారు. కొత్తగా రుణాలు ఇవ్వడంలేదు. కనీసం వారికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టడం లేదు. దివ్యాంగులకు ప్రత్యేకంగా నూరుశాతం హౌసింగ్ రుణాన్ని సబ్సిడీగా అందించేవారు. ఇప్పుడు దాన్ని ఎత్తివేసి అందరితో సమానంగానే రుణాలు ఇస్తున్నారు. గతంలో నెలకు 35 కిలోల బియ్యాన్ని ఉచితంగా ఇచ్చేవారు. ఇప్పుడు దాన్ని అమలు చేయడం లేదు.

ఆ శాఖలు పని చేస్తున్నాయా?

దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి దివ్యాంగ సంక్షేమశాఖతోపాటు దివ్యాంగ సంక్షేమ కార్పొరేషన్ కూడా ఉంది. కానీ, వారివద్ద దివ్యాంగులకు సంబంధించిన లెక్కలు కూడా లేవు. కార్పొరేషన్ ద్వారా ట్రైసైకిళ్లు, సెల్‌ఫోన్లు వంటివి ఇవ్వడం తప్ప ఉపాధికి ఎలాంటి సహాయమూ అందడం లేదు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు కలిపి కాకినాడలో మాత్రమే కార్యాలయాలు ఉన్నాయి. వాటి విభజన జరగకపోవడంతోపాటు సిబ్బంది కొరత కూడా ఉండడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ సూరింటెండెంట్, ఓ అటెండరుతో మూడు జిల్లాల దివ్యాంగుల సంక్షేమానికి, అభివృద్ధికి సంబంధించిన కార్యాలయం నడుస్తోంది.

నాడు టీడీపీలో ఇచ్చిందే.. ఐదేళ్లూ పెంచలేదు..



వైసీపీ వచ్చాక దివ్యాంగులను గాలికొదిలేసింది. టీడీపీ హయాంలో చంద్రబాబు అమలు చేసిన పథకాలు తప్ప వైసీపీ ఒక్క పథకం అమలు చేయలేదు. టీడీపీ హయాంలో ఇచ్చిన రూ.3 వేలు పెన్షనే ఈ ఐదేళ్లూ అందింది.. ఒక్క రూపాయి పెంచలేదు. నియోజకవర్గంలో సుమారు 10 వేల మందికి పైగా దివ్యాంగులు ఉన్నారు. వీరిలో చాలా మందికి కోతలు పెట్టారు. వైసీపీ ప్రభుత్వం వల్ల తమకు ఒరిగిందేమీ లేదు. - **గింజాల దుర్గాప్రసాద్‌యాదవ్, దివ్యాంగుల ప్రతిభావంతుల మండలాధ్యక్షుడు, సూరంపాలెం**

దివ్యాంగులకు వైసీపీ చేసిందేంలేదు..



తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దివ్యాంగులకు ఇచ్చిన రూ.3 వేల పెన్షనే ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం కూడా ఇస్తూ వస్తుంది. దివ్యాం గుల ఉపాధి కల్పన.. అభి వృద్ధికి వైసీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకున్న చర్యలు శూన్యం.
- అంగర శ్యామ్ గౌడ్, నిడదవోలు

మమ్మల్ని ఓటు బ్యాంకుగానే చూశారు



ఐదేళ్లలో 8.4 లక్షల మంది ఉన్న దివ్యాంగులకు ఇతరులతో కలిపి ఒకటే పెన్షన్ అమలుచేశారు. దివ్యాంగులను కేవలం ఓటు బ్యాంకుగానే చూడడం దురదృష్టకరం. ఈ ఐదేళ్లలో దివ్యాంగులను యాచకుల స్థాయికి దిగజార్చారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెపుతాం.
- సలాది ఎస్ఎన్ మూర్తి, రాజోలు

హామీలను విస్మరించిన జగన్..



వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పక్కన పెట్టింది. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను జగన్ విస్మరించారు. కమ్యూనిటీ హాళ్లు నిర్మించలేదు. పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని చేసిన అభ్యర్థనను చంద్రబాబు అంగీకరించారు. - **షేక్ నబీ, దివ్యాంగుల సంఘ నాయకుడు, మండపేట**

పింఛన్లు పెంచింది చంద్రబాబే..



మాకు ఇస్తున్న పింఛను చాలట్లేదు.గత టీడీపీ ప్రభుత్వంలోనే రూ.3 వేల పెన్షన్ ఇచ్చారు.. ఇప్పుడు జగన్ అదే ఇస్తున్నారు. మాకు పింఛన్లు పెంచింది చంద్రబాబు నాయుడే. ఈ సారి వస్తే మళ్లీ ఖచ్చితంగా పెంచుతారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో పెంచిన పింఛను కేవలం వెయ్యి మాత్రమే. - **ఇళ్ల రాణి, నేలటూరు, కపిలేశ్వరపురం మండలం**

మా ఆశను.. నిరాశగా మార్చారు..



వైసీపీ ప్రభుత్వంలో మాకు మేలు జరగలేదు. జగన్ వస్తే ఏదో చేస్తారనుకున్నాం.. కానీ చేసిందేం లేదు. మా ఆశను నిరాశగా మార్చారు. ప్రత్యేక రాయితీలు కల్పించాలి. మండల స్థాయిలో కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలి. బయట తిరిగేందుకు బ్యాటరీ వాహనాలు ఇవ్వాలి.
- టేకి దుర్గాభవాని, కపిలేశ్వరపురం మండలం

రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలి..



రూ.250 ఉన్న పింఛన్‌ను రూ.2 వేలు చేసిన ఘనత చంద్రబాబుదే. మేము మనుగడ సాగిం చాలంటే రూ.6వేలు ఇవ్వాలి. రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు అందించాలి. దివ్యాంగుల మేలు చేసే పార్టీకే ఓటు వేస్తాం.- **సిద్ధాంతపు చిట్టమ్మ, మండపేట**

జగన్ అన్యాయం చేశారు..



వైసీపీ పాలనలో దివ్యాంగులకు అన్యాయమే జరిగింది. జగన్ హామీలను నెరవేర్చలేదు.పీహెచ్ రిజర్వేషన్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీని ప్రభుత్వం విస్మరించింది. పింఛన్ మొత్తాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి అమలు చేయలేదు.
- ఆనాల వీరబాబు, దివ్యాంగుల రాష్ట్రీయ సేవాసమితి ప్రతినిధి, కోలంక, పిఠాపురం

కాలు లేకున్నా.. పింఛన్ ఇవ్వరు..



అత్యవసర సమయంలో ఆరోగ్యశ్రీ ఉపయోగపడదు. అర్హత ఉన్నా పింఛను రాదు. ఇదేం ప్రభుత్వం. గతేడాది రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమై వైద్యం కోసం ఆరోగ్యశ్రీ కార్డుతో ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేక సొంత సొమ్ము రూ.2 లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకున్నా. ఇన్‌ఫెక్షన్ ఎక్కువై కుడి కాలును కోల్పోయా. పింఛనుకు దరఖాస్తు చేసినా ఇప్పటివరకు మంజూరు కాలేదు.
- కొరపాటి ధర్మశేఖర్, దివ్యాంగుడు, గోపాలపురం

కోరుకొండంత అభిమానం



- అదిరిన పవన్ కల్యాణ్ షో
- భారీగా తరలివచ్చిన జనం
- నిండిన కోరుకొండ
- ఎమ్మెల్యే రాజాపై ఫైర్



కోరుకొండలో మాట్లాడుతున్న పవన్ చిత్రంలో పురందేశ్వరి, బత్తుల, జవహర్, బీవీఆర్ చౌదరి

కోరుకొండ/రాజానగరం/దివాన్‌చెరువు, ఏప్రిల్ 20 : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కోరుకొండ పాత బస్టాండ్ సెంటర్‌లో జరిగిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వారాహియాత్ర జన ప్రభంజనంతో సాగింది. సాయంత్రం 5 గంటల నుంచే పవన్‌ను చూడాలని రాజానగరం నలుమూలల నుంచి వేలాదిగా కోరుకొండకు తరలివచ్చారు. కోరుకొండ వీధులన్నీ జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలతో నిండిపోయాయి. పాతబస్టాండ్ సెంటర్‌లో స్టేట్‌బ్యాంక్ ఎదురుగా జాతీయ రహదారి మీద వారాహి వాహనంపై పవన్ ప్రసంగం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంది. 7.05 గంటలకు వారాహి వాహనంపైకి ఎక్కిన పవన్ 7.20 నుంచి 8.13 గంటల వరకూ ఏకధాటిగా మాట్లాడారు. రాజానగరం నియోజకవర్గం కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి 1200 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ల సమస్యలను పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు హామీ ఇచ్చి సమస్యను గాలికి వదిలేశారన్నారు. ప్రశాంతంగా ఉండే రాజానగరం నియోజకవర్గంలో జక్కంపూడి కుటుంబం గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు, ఇసుక, మట్టి, కొండల అడ్డాగా మార్చడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్ రావు మంచి కార్మిక నాయకుడని సామాన్య జీవితం గడిపేవారని, ఆయన అంటే ఎంతో గౌరవమన్నారు. అలాంటి మంచి కుటుంబం నుంచి వచ్చిన వారు కూడా జగన్మోహన్ రెడ్డి కారణంగా దోపిడీలకు, కమిషన్లకు కుక్కుర్తి పడడం బాధ కలిగిస్తుందన్నారు. 600 ఎకరాల ఆవభూముల కొనుగోలులో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందన్నారు. భూ సేకరణ పేరుతో రూ.100 కోట్లు కమిషన్ సంపాదించారని దాంట్లో ఎమ్మెల్యే, జగన్ ఎలా పంచుకున్నారో వారికే తెలియాలన్నారు. గాడాల, తదితర గ్రామాల్లో 150 ఎకరాల పైచిలుకు లే అవుట్లు వేసి వారి నుంచి 15 శాతం కమీషన్ వసూలు చేశారన్నారు. ఇళ్ళ పట్టాలు మీద రూ.300 కోట్లు సంపాదించారన్నారు. కోటికేశవరం, కోటి, మునగాల, కూనవరం, కాటవరం తదితర గ్రామాల్లో కొండలు మాయం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో బత్తుల బలరామకృష్ణను ఎమ్మెల్యేగా గ్లాజుగ్లాసుపై, కమలం గుర్తుపై ఓటు వేసి దగ్గుపాటి పురందేశ్వరిని ఎంపీగా గెలిపించాలన్నారు. వైసీపీ గుండాల తాటతీస్తామని, రాజానగరం, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పుతామన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ కూటమి అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు పనులు రివర్స్ టెండరింగ్ పిలుస్తామని చెప్పి సీఎం జగన్ మొత్తం ప్రాజెక్టును రివర్స్‌లో పెట్టారన్నారు. రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాల భూములు ఇచ్చిన రైతుల జీవితాలు బజారున పడేశారన్నారు. రాష్ట్రం రాజధాని లేకుండా తల లేని మొండెంలా ఉందని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా, కేంద్రంలో ప్రధాని మోదీ వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కోరుకొండ మార్కెట్ యార్డు నిర్మాణం చేయలేని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందమైన భవంతిని మాత్రం కట్టుకున్నారన్నా రు. రాజానగరం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ జనసేన అభ్యర్థిగా పోటీ చేసేందుకు మొదటి జాబితాలోనే నాకు అవ కాశం కల్పించడమే మనకు పెద్దపండుగ..ఈ సీటును గెలిపించి పవన్‌కల్యాణ్‌కు బహుమతి అందించాలన్నారు.రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి మాట్లాడుతూ ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలుసుకోవాలనే పవన్‌కల్యాణ్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని నేను రాజానగరం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉండాలన్నప్పటికీ వెనక్కి తగ్గానన్నారు. ఈ సీటును ముందుగా పవన్‌కల్యాణ్ జనసేనకు ప్రకటించడంపట్ల నేను, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందిపడ్డ మాట వాస్తవమేనన్నారు. మూడు పార్టీలు ఐక్యమత్యంగా ముందుకు వెళ్లి కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. సభ జరుగుతుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు దీనిపై చర్చించుకోవడం కనిపించింది. భారీ జనరేటర్లు ఏర్పాటు చేయడంతో సభ నిర్వహణకు ఎటువంటి ఆటంకం లేకుండా దిగ్విజయంగా సాగింది. సభ అనం తరం పవన్ కల్యాణ్ రోడ్డు మార్గాన గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలులోని తన నివాసానికి చేరుకున్నారు. వారాహి యాత్రలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జవహర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, నీరుకొండ వీరన్న చౌదరి, చిట్టూరి రవీంద్ర పాల్గొన్నారు.






పిఠాపురం మండలం కొత్తపల్లిలో టీడీపీ జెండా ఎగురవేస్తున్న పవన్

పిఠాపురంలో నేను గెలిస్తే.. వర్మ గెలిచినట్టే : పవన్

కొత్తపల్లి, ఏప్రిల్ 20: పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తాను గెలిచినా పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ నెగ్గినట్టేనని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కె.పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి సురక్ష ప్యాలెస్‌లో శనివారం నిర్వహించిన పిఠాపురం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా ఆ పార్టీ పిఠాపురం ఇన్‌చార్జి వర్మ ఏర్పాటు చేసిన కేకును పవన్‌కల్యాణ్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పవన్ మాట్లాడుతూ చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం కావాలని వేధించడంవల్ల జనసేన రిస్క్ తీసుకొని టీడీపీకి అండగా నిలిచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ 175 స్థానాల్లో పోటీ చేస్తునట్టు భావించి మూడు పార్టీల కార్యకర్తలు ఐకమత్యంగా పోరాడి ఉమ్మడి విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు.

రేపు చంద్రబాబు రాక

జగ్గంపేటలో బహిరంగ సభకు టీడీపీ అధినేత



జగ్గంపేట, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత నారాచంద్రబాబునాయుడు సోమవారం కాకినాడ జిల్లా జగ్గంపేటలో పర్యటిస్తారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ శనివారం తెలిపారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా మధురపూడి ఎయిర్‌పోర్ట్ నుంచి 3.05 గంటలకు హెలికాఫ్టర్‌లో బయలుదేరి 3.15 గంటలకు జగ్గంపేట-గోకవరం రోడ్డులోని కోడూరి రంగారావు పొలం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి జగ్గంపేట మెయిన్‌రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభకు 3.30 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 5 గంటల వరకు సభలో పాల్గొంటారు. అనంతరం 5.10 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాఫ్టర్‌లో విజయనగరం జిల్లాకు బయలుదేరి వెళ్తారు.శనివారం హెలిప్యాడ్ ప్రాంతాన్ని జ్యోతుల నెహ్రూ, పోలీసులు, అధికారులు పరిశీలించారు.సభకు జగ్గంపేట నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన నాయకులు, అభిమానులు భారీగా తరలివస్తారన్నారు. ఎండవేడిమికి ఇబ్బంది లేకుండా మజ్జిగ, మంచినీరు, కూలర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మూడో రోజూ నామినేషన్ల సందడే..

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: మూడో రోజు శనివారం నామినేషన్ల పర్వం ప్రశాంతంగా ముగిసింది.ప్రధాన పార్టీల అభ్యర్థులు రెండో సెట్ నామినేషన్లు దాఖలు చేయగా.. చిన్న చిన్న పార్టీల అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేయడం విశేషం. ఇక ఆదివారం సెలవు కావడంతో మరో మూడు రోజులు 25వ తేదీ వరకూ మాత్రమే నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. తూర్పు గోదావరి జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పది మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. కొవ్వూరు అసెంబ్లీకి టీడీపీ తరపున ముప్పిడి సుజాత, వైసీపీ తరపున తలారి వెంకట్రావు, నిడదవోలు నియోజకవర్గానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ముక్కామల అన్నవర ప్రసాద్, వైసీపీ తరపున గెడ్డం సుమలత, వైసీపీ తరపున రెండో సెట్ నామినేషన్‌ను గెడ్డం శ్రీనివాసనాయుడు దాఖలు చేశారు.అనపర్తి అసెంబ్లీ స్థానానికి జైభీమ్‌రావు భారత్ పార్టీ తరపున లింగం గంగాధర్, రాజానగరం అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా బర్రే ఆనంద్‌కుమార్, రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ స్థానానికి రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ తరపున మేడా శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా బొద్దాపు శివ విష్ణుప్రసాదరావు, భారత చైతన్య యువజన పార్టీ తరపున దుగ్గిరాల శ్రీదేవి నామినేషన్ వేశారు.

బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో 5..

అమలాపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఐదుగురు నామినేషన్లు దాఖలు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. రాజోలు అసెంబ్లీ స్థానానికి కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ మూడు సెట్ల నామినేషన్ పత్రాలను జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎస్.నుపూర్‌అజయ్‌కు సమర్పించారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున పిల్లి సూర్యప్రకాష్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చే



కొవ్వూరులో నామినేషన్ పత్రం అందజేస్తున్న ముప్పిడి సతీమణి సుజాత

యగా స్వతంత్ర అభ్యర్థిగా కాటే సుబ్రహ్మణ్యం నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎస్.సుధాసాగర్‌కు అందించారు. ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జై భారత్ నేషనల్ పార్టీ తరపున వనచర్ల బాబ్జీ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎస్డీసీ మదన్‌మోహనరావుకు అందించారు. పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మాకే దేవిప్రసాద్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తికి అందించారు.

కాకినాడ జిల్లాలో 6..

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 20: కాకినాడ జిల్లాలో శనివారం ఆరు నామినేషన్లు దాఖలు అయ్యాయి. కాకినాడ లోక్‌సభకు పెయ్యల దుర్గాప్రసాద్ ఇండిపెండెంట్‌గా నామి నేషన్ దాఖలు చేశారు. తుని అసెంబ్లీ స్థానానికి వాడబోయిన శివ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తరపున నామినేషన్ వేశారు. కాకినాడ రూరల్ అసెంబ్లీ స్థానానికి చాగంటి సూర్యనారాయణమూర్తి ఇండిపెండెంట్‌గా.కూటమి తరపున పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) మరో పర్యాయం నామినేషను దాఖలు చేశారు. జగ్గంపేట నియోజకవర్గానికి బాలిరెడ్డి సాల్మన్‌రాజు ఇండిపెండెంట్‌గా, సాదే నరేంద్రబాబు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి సమర్పించారు.

అట్లుంటది జగన్‌తోని..

ప్రజా సంకల్ప యాత్ర పేరుతో జగన్ జనం మధ్య లోకి వచ్చారు. కోటలు దాటిన మాటలతో ఎన్నో హామీలు ఇచ్చారు. అడిగిన వారికి అడిగినట్లు వరాల జల్లు కురిపించారు. కానీ ఇదంతా పాదయాత్ర స్టంట్ అని అప్పట్లో ఎవరికీ తెలియలేదు. జగన్ సీఎం అయితే అన్ని హామీలు నెరవేరుస్తారని ఆశించారు. కానీ జగన్ సీఎం అయ్యాక ఒక్కటంటే ఒక్క హామీ కూడా నెరవేరలేదు.

● ఆత్రేయపురం

ఆదుకుంటానని ఆదమరిచారు


పూతరేకులు తయారు చేస్తున్న మహిళతో మాట్లాడుతున్న జగన్

2018 జూన్ 13న రాజమహేంద్రవరం నుంచి ధవళేశ్వరం బ్యారేజీ మీదుగా జగన్ ఆత్రేయపురం మండలంలోకి అడుగుపెట్టారు. జూన్ 14న పేరవరం నుంచి లొల్ల వరకూ పాదయాత్ర నిర్వహించారు. వెలిచేరు, పులిదిండి, ఆత్రేయపురం మీదుగా సాగిన పాదయాత్రలో జగన్ హామీల వర్షం కురిపిస్తూ వెళ్లారు. ఆత్రేయపురం మండలంలో పూతరేకులు, మామిడితాండ్ర, పచ్చళ్ల ద్వారా జీవనోపాధి పొందుతున్న మహిళలను కలిసిన జగన్ వారి స్థితిగతులను అడిగి తెలుసుకుని వారికి బోలెడు హామీలు ఇచ్చారు. జీఎస్టీ నుంచి మినహాయింపు కావాలని, ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయం కల్పించాలని వ్యాపారులు కోరారు. పచ్చళ్ల నిల్వ ఉంచుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని మహిళలు విన్నవించుకున్నారు. నార్కెడుమిల్లి, లొల్ల, ఉచ్చిలి, ఆత్రేయపురం గ్రామాల్లో వందల కుటుంబాలు పచ్చళ్ల తయారు చేసుకుంటూ ఇతర రాష్ట్రాలలో సైకిల్‌పై తిరిగి అమ్మకాలు సాగిస్తున్నారు. వారి ఉత్పత్తులు తీసుకువెళ్తున్న సమయంలో జీఎస్టీ విధిస్తున్నారు. ఆ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వాలని వారంతా జగన్‌కు మొరపెట్టుకున్నారు. ఉద్యానవన రైతులు తమ పంటలలో పండించిన ఉత్పత్తులకు నిల్వ ఉంచుకునేందుకు కోల్డ్‌స్టోరేజీ నిర్మించాలని కోరారు. అలా వారు కోరిన హామీలన్నీ నెరవేరుస్తానని జగన్ హామీలు ఇచ్చి వెళ్లిపోయారు. నేటికీ ఆ హామీలు నెరవేరలేదు.

హామీలిచ్చి ఆదమరిచి..
పాదయాత్రలో కలిసిన
ప్రతీ వర్గానికీ వరాల జల్లులు
అది చేస్తా..ఇది చేస్తా అంటూ
కోటలు దాటిన మాటలు
అధికారంలోకి వచ్చాక ఒక్క
హామీ కూడా
నెరవేర్చని వైనం

మోసపోయిన గీత కార్మికులు

వెలిచేరు వద్ద వందల సంఖ్యలో కల్లుగీత కార్మికులు తమను ఆదుకోవాలంటూ జగన్‌ను కలిశారు. రూ.10 లక్షల ప్రమాద బీమా, కార్మికుడికి రూ.3 వేలు పింఛన్ తదితర డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సంఘం నేతలు జగన్‌కు అందజేశారు. అందరి కష్టాలు తీర్చేందుకే పాదయాత్ర చేస్తున్నానని చెప్పిన జగన్ వారికి అనేక హామీలు ఇచ్చారు. కల్లు గీత కార్మికులు కళ్లు కాయలు కాసేలా ఎదురు చూసినా అవి అమలుకు నోచుకోలేదు.


అప్పటి పాదయాత్రలో జగన్‌కు వినతి పత్రం అందిస్తున్న కల్లు గీత కార్మికులు

దగాపడ్డ స్వర్ణకారులు


స్వర్ణకార సంఘం ప్రతినిధులతో జగన్(ఫైల్)

ఆత్రేయపురంలో జరిగిన జగన్ పాదయాత్రలో ఉమ్మడి జిల్లా విశ్వ బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు జగన్‌కు వివిధ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. స్వర్ణకారులకు పోలీసుల వేధింపుల నుంచి విముక్తి కల్పించాలని, మంగళసూత్రాలు స్వర్ణకారులు మాత్రమే తయారు చేసుకునే హక్కు కల్పించాలని, చట్టసభల ద్వారా జీవోను విడుదల చేయాలని కోరారు. అన్నింటిని విన్న జగన్ వారికి హామీలు ఇచ్చారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. విశ్వబ్రాహ్మణులకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ నెరవేరకపోవడంతో విశ్వ బ్రాహ్మణులు అసంతృప్తితో ఉన్నారు.

అభిమాన 'ముద్ర'

నాయకుడు మీద పెంచుకున్న అభిమానాన్ని ఒక్కో విధంగా ప్రదర్శిస్తుంటారు అభిమానులు. పూలమాలలు వేయడం, కటౌట్లు ఏర్పాటు చేయడం, పెద్ద పెద్ద ఫ్లెక్సీలు ప్రదర్శించడం..రూపం ఏదైనా అంతిమ లక్ష్యం అభిమానాన్ని చాటడమే.. శనివారం రాజానగరంలో జరిగిన జనసేన అధినేత పవన్ కల్యాణ్ వారాహి సభలో కొంతమంది యువకులు పచ్చబొట్లతో కనిపించారు. పవన్ ఫొటో, పవన్ పేర్లతో ఉన్న పచ్చబొట్లను అభిమానులు ప్రదర్శించారు. అభిమాన నాయకుడిని చూస్తూ కేరింతలు కొడుతూ అద్యంతం ఉత్సాహంగా కనిపించారు.





పంక్చర్ వేసిన బుచ్చయ్య!



రాజమహేంద్రవరం 28వ డివిజన్‌లో ప్రచారంలో భాగంగా రాజమండ్రి రూరల్ నియోజకవర్గ కూటమి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఓ సైకిల్ రిపేర్ షాపు దగ్గర ఆగి...కొద్దిసేపు యజమానితో ముచ్చటించారు. ఆపై తాను కూడా పంక్చర్ వేసేందుకు సిద్ధమై కొద్దిసేపు ప్రయత్నించారు..

మార్పు కోసం నేను సైతం..

5 సార్లు ఇండిపెండెంట్‌గా..



పి.గన్నవరం, ఏప్రిల్ 20: మాకే దేవీప్రసాద్.. ఈయనొక పట్టువదలని విక్రమార్కుడు. ఈయన ఒకటి కాదు రెండు కాదు ఏకంగా ఐదుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్నారు. ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. 71 ఏళ్ల మాకే దేవీప్రసాద్ నగరం నియోజకవర్గంగా ఉన్న సమయంలో 1983, 1989లో రెండు సార్లు, గన్నవరం నియోజకవర్గం ఆవిర్భావం తర్వాత 2014, 2019లో రెండు సార్లు నామినేషన్ దాఖలు చేశారు. 2024 ఎన్నికల్లో కూడా ఆయన బరిలో ఉండడం విశేషం. పి.గన్నవరం తహసీల్దార్ కార్యాలయంలో శనివారం ఆయన పి.గన్నవరం నియోజకవర్గం నుంచి ఇండిపెండెంట్‌గా నామినేషన్ పత్రాలు సమర్పించారు. అంబాజీపేటకు చెందిన దేవీప్రసాద్ 2002లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా కూడా నామినేషన్‌ను దాఖలు చేశారు. 1995లో పి.గన్నవరం నుంచి కాంగ్రెస్ పార్టీ తరపున జడ్పీటీసీగా పోటీ చేసి గెలుపొందారు. సమాజంలో మార్పు వచ్చే వరకు నామినేషన్ వేస్తూనే ఉంటానని దేవీప్రసాద్ స్పష్టం చేశారు.

3 ముగ్గురు


కుడుపూడి సూర్యనారాయణ


కుడుపూడి ప్రభాకరరావు


కుడుపూడి చిట్టబ్బాయి

ఇండిపెండెంట్‌గా నిలిచి..గెలిచి

అమలాపురం రూరల్, ఏప్రిల్ 20: అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గంలో కుడుపూడి వంశీకులకు ఓ ప్రత్యేకత ఉంది. కుడుపూడి కుటుంబం నుంచి రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన ముగ్గురూ స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో నిలిచి యోధానుయోధులైన నాయకులపై విజయం సాధించి తమకు తామే సాటి అని నిరూపించుకున్నారు. వారిలో ఒకరైన కుడుపూడి ప్రభాకరరావు నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడమే కాకుండా మంత్రిగా కూడా పనిచేసి రికార్డు సృష్టించారు. 1962లో తొలిసారిగా కుడుపూడి సూర్యనారాయణ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. 1967 ఎన్నికల్లో సూర్యనారాయణ కుమారుడైన కుడుపూడి ప్రభాకరరావు స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి ఘన విజయం సాధించారు. ఆ తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రభాకరరావు 1972, 1985, 1989 ఎన్నికల్లో విజయం సాధించారు. కోట్ల విజయభాస్కరరెడ్డి మంత్రివర్గంలో వాణిజ్య పన్నుల శాఖ మంత్రిగా పనిచేసి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. 2004 ఎన్నికల్లో కుడుపూడి చిట్టబ్బాయి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేయాల్సి ఉంది. చివరి నిమిషంలో సీటు చేజారిపోవడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచి విజయం సాధించారు. ఇలా ఒకే కుటుంబం నుంచి ముగ్గురు తొలి ప్రయత్నంలోనే స్వతంత్ర ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు.



'సైకిల్' లేకుండా...

రాజానగరం నియోజకవర్గం

ఏర్పడిన తర్వాత టీడీపీ లేకుండా తొలిసారి పోటీ

రాజానగరం/దివాన్‌చెరువు, ఏప్రిల్ 20: రాజానగరం నియోజకవర్గం ఆవిర్భవించిన తర్వాత తొలిసారి టీడీపీ లేకుండా పోటీ జరుగుతోంది. టీడీపీ ఎన్నికల చిహ్నం అయిన సైకిల్ గుర్తు లేకుండా బ్యాలెట్ పేపర్ ఉండడం మొదటిసారి. శాసనసభ నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009వ సంవత్సరంలో రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం ఏర్పడింది. అప్పటి వరకు కడియం అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న రాజానగరం మండలంతో పాటు అప్పటి బూరుగుపూడి నియోజకవర్గంలోని కోరుకొండ, సీతానగరం మండలాలు కలిపి రాజానగరం నియోజకవర్గం ఏర్పడింది. 2009 సంవత్సరంలో రాజానగరం నియోజకవర్గానికి మొదటి సారిగా ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పెందుర్తి వెంకటేష్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చిట్టూరి రవీంద్ర, ప్రజారాజ్యం పార్టీ అభ్యర్థి ముత్యాల శ్రీనివాస్ మధ్య ప్రధాన పోటీ నెలకొంది. ఈ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పెందుర్తి వెంకటేష్ తమ సమీప ప్రత్యర్థి చిట్టూరి రవీంద్రపై దాదాపు 6,966 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. 2014 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి పెందుర్తి వెంకటేష్, వైసీపీ అభ్యర్థి జక్కంపూడి విజయలక్ష్మి మధ్య హోరాహోరీగా జరిగిన పోటీలో టీడీపీ అభ్యర్థి పెందుర్తి వెంకటేష్ 8,887 ఓట్ల అధిక్యంతో రెండోసారి సైకిల్ గుర్తుపై విజయం సాధించారు. 2019లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా పెందుర్తి వెంకటేష్ మూడోసారి పోటీ చేయగా వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన జక్కంపూడి రాజా, జనసేన అభ్యర్థి రాయపురెడ్డి ప్రసాద్ (చిన్న)మధ్య ప్రధాన పోటీ సాగింది. ఈ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి రాజా 31,770 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో రాజానగరం అసెంబ్లీ సీటు జనసేనకు కేటాయించారు. దీంతో సైకిల్ గుర్తు లేకుండానే రాజానగరం నియోజకవర్గానికి తొలిసారిగా ఎన్నికలు జరుగుతున్నాయి.

ఒకప్పటి పరిశ్రమల తోట జగ్గంపేట

నియోజకవర్గ చరిత్ర



● జగ్గంపేట

జగ్గంపేట ఓ ప్రత్యేకమైన నియోజకవర్గం..రాజకీయంగా చైతన్యవంతమైనది. అలాగే ఒకప్పుడు పారిశ్రామికంగా ఎంతో ఘన కీర్తి కలది. రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు సైతం పెంకులు ఇక్కడ నుంచే వెళ్లేవి. ప్రధాన సాగునీటి ప్రాజెక్టులకు కొలువుగా నియోజకవర్గం ఉంది. జగ్గంపేట చుట్టుపక్కల వందలాది గ్రామాలకు వ్యాపార కేంద్రం.

ఓటర్లు

జగ్గంపేట నియోజకవర్గంలో 2,28,740 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,13,035, స్త్రీలు 1,15,692, ఇతరులు 13 మంది ఉన్నారు.

నియోజకవర్గంలోని గోకవరం మండలం సూదికొండ రేంజ్‌లో గోకవరం, జగ్గంపేట మండలాల్లో అటవీ ప్రాంతం వేల ఎకరాల్లో ఉంది. ప్రధానంగా బావారం, ముల్లేరు, మల్లవరం తదితర ప్రాంతాల్లో అటవీ సంపద ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తుంది. జగ్గంపేట నియోజకవర్గంలో కిర్లంపూడి మండలం సోమవరం నుంచి మొదలుకుని గండేపల్లి మండలం మురారి వరకు సుమారు 30 కిలోమీటర్ల మేర జాతీయ రహదారి కలిగి ఉంది.

ప్రాజెక్టులకు పెద్దదిక్కు



నియోజకవర్గంలో సాగు, తాగునీటి ప్రాజెక్టులు పుష్కలంగా ఉన్నాయి. తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్, ముసురుమిల్లి ప్రాజెక్టు, పురుషోత్తపట్నం ఫేజ్-2, బావారం రక్షిత మంచినీటి పథకం, మల్లవరం ఎత్తిపోతల పథకంతో నియోజకవర్గం సస్యశ్యామలంగా ఉంటుంది.. గండేపల్లి మండలం తాళ్లూరులో గోదావరి జలాలను మెట్ట ప్రాంతానికి తరలించేందుకు పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేశారు. దీంతో 30వేల ఎకరాలకు సాగునీరందుతోంది. గోకవరం మండలం ముసురుమిల్లి ప్రాజెక్టు ద్వారా ఏజెన్సీలోని కొండల్లో పారే నీటిని లిఫ్ట్ చేసి గోకవరం, రంపచోడవరం మండలాలకు సాగునీటిని అందిస్తున్నారు. గోదావరి జలాలను ఏలేరుకు అనుసంధానం చేసేందుకు రూ.600 కోట్లతో జగ్గంపేట మండలం రామవరంలో పురుషోత్తపట్నం ఫేజ్-2 ప్రాజెక్టు ఏర్పాటు చేశారు. పైపు లైన్ల ద్వారా జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం, పెద్దాపురం నియోజకవర్గాలో సాగు, తాగునీరు అందించడంతో పాటు విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు నీటిని తరలిస్తున్నారు. వైజాగ్, విజయనగరం, శ్రీకాకుళం సుజల ప్రవంతి పథకానికి ఇక్కడి నుంచి నీటిని మళ్లించడం విశేషం. మల్లవరం ఎత్తిపోతల పథకాన్ని రూ.130 కోట్లతో గత టీడీపీ ప్రభుత్వంలో మంజూరు చేశారు. జగ్గంపేట, గండేపల్లి, పెద్దాపురం మండలాల్లో ఎత్తైన ప్రాంతాలకు సాగునీరు అందించాలనే ఉద్దేశ్యంతో ఈ ప్రాజెక్టు మొదలైంది. మధ్యలో వైసీపీ

ఆవిర్భావం

జగ్గంపేట నియోజకవర్గం 1955లో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, గోకవరం మండలాలతో ఏర్పడింది. అయితే గతంలో రంగంపేట మండలం ఉండేది. 2009లో నియోజకవర్గ పునర్విభజనలో భాగంగా రంగంపేట మండలం అనపర్తి నియోజకవర్గంలోకి చేరగా గోకవరం మండలం జగ్గంపేట నియోజకవర్గంలో కలిసింది. జగ్గంపేట మండలంలో 16 పంచాయతీలు 21 గ్రామాలు, గండేపల్లి మండలంలో 18 గ్రామ పంచాయతీలు, కిర్లంపూడి మండలంలో 19 గ్రామ పంచాయతీలు 21 గ్రామాలు, గోకవరం మండలంలో 14 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. నియోజకవర్గంలో 248 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 15 దఫాలుగా ఎన్నికలు జరగగా రెండుసార్లు ఇండిపెండెంట్లు, ఆరుసార్లు కాంగ్రెస్, ఐదుసార్లు తెలుగుదేశం, రెండుసార్లు వైసీపీ గెలుపొందాయి. గెలుపొందిన వారిలో తొమ్మిది మంది స్థానికులే నియోజకవర్గానికి చెందిన పంతం పద్మనాభం పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా, తోట సుబ్బారావు రవాణా శాఖ మంత్రిగా, తోట నరసింహం రెవెన్యూ అండ్ స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రిగా పనిచేశారు.


ఒకప్పటి పెంకు పరిశ్రమ

ఎమ్మెల్యేలుగా పనిచేసింది వీళ్లే..

జగ్గంపేట నియోజకవర్గంలో 1955లో మొదట ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసిన దూరిశెట్టి గోపాలరావు ఎమ్మెల్యేగా విజయం సాధించి మొట్టమొదటి జగ్గంపేట ఎమ్మెల్యేగా సేవలందించారు. 1962లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి వడ్డి ముత్యాలరావు, 1967లో ఇండిపెండెంట్‌గా కె.పంతం, 1972, 1978లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి పంతం పద్మనాభం, 1983, 1985, 1989లో తెలుగుదేశం నుంచి తోట సుబ్బారావు, 1991లో బై ఎలక్షన్‌లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి తోట వెంకటాచలం, 1994, 1999లో తెలుగుదేశం నుంచి జ్యోతుల నెహ్రూ, 2004, 2009లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ నుంచి తోట నరసింహం, 2014లో వైసీపీ నుంచి జ్యోతుల నెహ్రూ, 2019లో వైసీపీ నుంచి జ్యోతుల చంటిబాబు ఎమ్మెల్యేలుగా పోటీ చేసి గెలుపొందారు.

'డ్రైనేజీ' అస్తవ్యస్తం

జగ్గంపేటలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షాకాలంలో జగ్గంపేట పల్లపు ప్రాంతాలన్నీ నీట మునిగిపోతున్నాయి. ఎన్ని ప్రభుత్వాలు ఏర్పడినా దీనికి సరైన పరిష్కారం చేయలేకపోయారు. జగ్గంపేటలో ఫ్యాక్టరీ ఏర్పాటుతో వాతావరణం కలుషితం కావడంతో పాటు చుట్టుపక్కల భూములన్నీ పాడైపోతున్నాయి. అప్రోచ్‌రోడ్డు విస్తరణ జరపకపోతే ట్రాఫిక్ సమస్య అధికమయ్యే అవకాశముంది.

365 రోజులు పండే పంటలు

ఈ నియోజకవర్గంలో 365 రోజులు పండించే భూములున్నాయి. అటు విద్యుత్ బోర్లు, ఇటు పుష్కర జలాల ద్వారా జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల్లో భూములను కౌలుకు తీసుకుని మొక్కజొన్న, స్వీట్‌కార్న్, పచ్చిఎండుమిర్చి, అరటి, చేమదుంప, అపరాలు, శనగలు, జామ, బొప్పాయి పూల తోటలు పండిస్తున్నారు. కిర్లంపూడి మండలం బూరుగుపూడిలో కూరగాయల మార్కెట్ ద్వారా మన జిల్లా నుంచే కాకుండా ఒడిషా బీహార్, బెంగాల్ కూరగాయలను ఎగుమతి చేస్తున్నారు.

శాగో పరిశ్రమలకు పేరు..



జగ్గంపేట మండలం మల్లిశాల, కిర్లంపూడి మండలం బూరుగుపూడి, గండేపల్లి మండలం తాళ్ళూరు, గోకవరం మండలం కొత్తపల్లిలో శాగో పరిశ్రమలు ఉండేవి. నేడు బూరుగుపూడి శాగో ఫ్యాక్టరీ ఒక్కటే అంతంత మాత్రంగా నడుస్తుంది. ఈ ప్రాంతంలో వర్షాధారంగా ప్రధానంగా పండే పంట దుంప. కేరళ తరహాలో ఈ దుంపను సాగు చేసి సగ్గు బియ్యం తయారు చేసి ఇతర రాష్ట్రాలకు తరలించేవారు. చాలా వరకు పరిశ్రమలు మూసివేయడంతో మెట్టకు జీవనాధారమైన దుంప పంట పండించే వారి సంఖ్య తగ్గుతూ వస్తుంది. మిగిలిన కొద్దిమంది రైతులు అదే పంటను అరకొరగా పండిస్తున్నారు.

పెంకు పరిశ్రమకు ప్రసిద్ధి

జగ్గంపేట నియోజకవర్గం పెంకు పరిశ్రమకు పెట్టింది పేరు. ఉమ్మడి రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాలకు సైతం ఇక్కడ నుంచి పెంకులు ఎగుమతి అయ్యేవి. సుమారు 42 పెంకు పరిశ్రమల్లో 20 వేల మంది కార్మికులు పనిచేసేవారు. జగ్గంపేట అంటే పెంకుల జగ్గంపేట అనేవారు. అయితే నేడు ఒక్క పెంకు పరిశ్రమ కూడా లేని పరిస్థితికి వచ్చింది. దీంతో పారిశ్రామికంగా జగ్గంపేట కుదేలైంది. పెంకు పరిశ్రమ కనుమరుగవడంతో కూలీలు వలస బాట పట్టారు. జగ్గంపేట, గండేపల్లి, గోకవరంలోని నగరులు ఈ పరిశ్రమలపై ఆధారపడి బతికేవారు. వీరంతా ఇప్పుడు ఇతర రాష్ట్రాలకు వెళ్లి జీవనోపాధి సాగిస్తున్నారు.



రాజోలులో నామినేషన్ దాఖలు చేస్తున్న రాజోలు నియోజకవర్గ కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్

కోలాహలంగా కూటమి అభ్యర్థి దేవ నామినేషన్

రాజోలు, ఏప్రిల్ 20: జనసేన, బీజేపీ, టీడీపీ కూటమి రాజోలు నియోజకవర్గ అభ్యర్థి దేవ వరప్రసాద్ శనివారం మూడు సెట్ల నామినేషన్ పత్రాలను రాజోలు తహసీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఎస్.నుపూర్‌అజయ్‌కు అందజేశారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం నుంచి ఊరేగింపుగా బయలుదేరి మలికిపురం, గుడిమెళ్లంక, శివకోడు లాకులు, శివకోడు నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో రాజోలు చేరుకున్నారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయన నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, లింగోలు పెద్దబ్బులు, ముదునూరి చినబాబురాజు, ఎంపీపీ కేతా శ్రీను, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల టీడీపీ అధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, అడబాల యుగంధర్ ముప్పర్తి నాని, ప్రధాన కార్యదర్శి చాగంటి స్వామి, మంగెన భూదేవి, బందెల పద్మ, మట్టపర్తి లక్ష్మి, రాపాక నవరత్నం, గుండుబోగుల పెదకాపు, వైస్ ఎంపీపీ యింటిపల్లి ఆనందరాజు, పినిశెట్టి బుజ్జి పాల్గొన్నారు.

గొల్లప్రోలు చేరుకున్న పవన్‌కల్యాణ్

● స్థానికులతో మాటామంతి

గొల్లప్రోలు, ఏప్రిల్ 20: జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా పర్యటన నిమిత్తం గొల్లప్రోలు చేరుకున్నారు. బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో గొల్లప్రోలు హెలిప్యాడ్ వద్దకు శనివారం ఉదయం 11.35 గంటలకు చేరుకున్నారు. పవన్‌కల్యాణ్‌కు కాకినాడ జనసేన ఎంపీ అభ్యర్థి తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, డీకే చైతన్య ఆదికేశవులు తదితరులు స్వాగతం పలికారు. పవన్ వస్తున్న విషయం తెలుసుకుని అభి మానులు భారీగా తరలివచ్చారు. వారితో పవన్‌కల్యాణ్ ముచ్చటించారు. వారి కుటుంబ వివరాలు, నియోజకవర్గ పరిస్థితి తదితర అంశాలు గురించి ఆరా తీశారు, అనంతరం అక్కడి నుంచి చేబ్రోలులోని నివాసానికి చేరుకున్నారు. అక్కడ పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులను పార్టీలోకి చేర్చుకున్నారు. మధ్యాహ్నం 1.35గంటలకు బయలుదేరి కొత్తపల్లి మండలంలో జరిగిన టీడీపీ సమావేశంలో పాల్గొనేందుకు వెళ్లి తిరిగి 3.10కు చేబ్రోలు నివాసానికి చేరుకున్నారు. సాయంత్రం 5.30కు గొల్లప్రోలు హెలిప్యాడ్ నుంచి రాజమహేంద్రవరం విమానాశ్రయానికి బయలుదేరారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన కోరుకొండలో జరిగే బహిరంగ సభలో పాల్గొన్నారు.

పవన్ కాన్వాయ్‌లో అంబులెన్స్

పవన్ పర్యటనకు పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పవన్ కాన్వాయ్‌లో నాలుగు పోలీసు వాహనాలతో పాటు ప్రవేటు అంబులెన్స్ చేరింది. తన అభిమానుల్లో కొందరు కిరాయిమూకలు కలిసి బ్లేడుతో తనను, తన భద్రతా సిబ్బంది కోస్తున్నారని పవన్ సంచలన వ్యాఖ్యలు చేయడం, ఇటీవల పవన్‌పై రాయి దాడి జరిగిన నేపథ్యంలో పోలీసులు బందోబస్తును పెంచారు. కాన్వాయ్‌లోనూ పోలీసు వాహనాల సంఖ్య పెరిగింది. పవన్ పర్యటించే మార్గాల్లో దారిపొడవునా పోలీసులను మోహరించారు. పవన్ జ్వరంతో బాధపడుతున్న నేపథ్యంలో అత్యవసర వైద్యసేవలు అందించేందుకు అంబులెన్స్‌ను కాన్వాయ్‌లో ఉంచినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.



హెలిప్యాడ్ వద్ద స్థానికులతో మాట్లాడుతున్న జనసేన అధినేత పవన్‌కల్యాణ్

కొండబాబుకు మద్దతుగా
సినీ నటుడు పృథ్వీరాజ్ ప్రచారం



కూటమి అభ్యర్థి కొండబాబుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న సినీ నటుడు పృథ్వీరాజు

కాకినాడ సిటీ, ఏప్రిల్ 20: కాకినాడసిటీ అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి వనమాడి కొండబాబుకు మద్దతుగా సినీనటుడు పృథ్వీరాజ్ ప్రచారం నిర్వహించారు. స్థానిక 27వ డివిజన్‌లో శనివారం సాయంత్రం పర్యటించిన పృథ్వీరాజ్ మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, సంగిశెట్టి అశోక్, కోడూరి పెద్ద, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

రూ.4.16 లక్షలు నగదు స్వాధీనం



మండపేటలోని కారులో నగదు స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

మండపేట, ఏప్రిల్ 20: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట నియోజకవర్గంలో సాధారణ తనిఖీల్లో భాగంగా రూ.4.16 లక్షల నగదు సీజ్ చేసినట్టు నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎల్లారావు తెలిపారు. మండపేట టౌన్ సీఐ అఖిల్ జమ, ఎస్ఐ హరికోటిశాస్త్రి ఆధ్వర్యంలో శనివారం బైపాస్ టోల్‌గేటు వద్ద తనిఖీలు నిర్వహించగా కె.కృష్ణకాంత్‌కు చెందిన హోండా ఇమేజ్ కారులో రూ.లక్ష ఉన్నట్టు గుర్తించారు. ఆధారాలు లేకపోవడంతో మండల ఫ్లయింగ్ స్క్వాడ్‌కు సమాచారం ఇవ్వగా సయ్యద్ ఎ.అజీజ్ అక్కడకు చేరుకుని కేసు నమోదు చేశారు. జెడ్.మేడపాడులో ఎస్ఎస్టీ బృందం అధికారి వెంకటలక్ష్మి మోటారు సైకిలును తనిఖీ చేసి రూ.2.46 లక్షల నగదు ఉన్నట్టు గుర్తించారు. పెన్మెత్స గౌరీశంకరరాజు నుంచి ఆ సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. కోరుమిల్లి లాకులవద్ద ఎస్ఎస్టీ బృందం నిర్వహించిన తనిఖీల్లో పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట మండలం వల్లూరుకు చెందిన ఉయ్యూరి శ్రీనివాసరాజు కారులో రూ.70వేలు ఉన్నట్టు గుర్తించారు. బృంద అధికారి ఐ.మాణిక్యం ఆ నగదును స్వాధీనం చేసుకున్నట్టు ఎన్నికల అధికారి ఎల్లారావు తెలిపారు.

పొన్నవాహనంపై శ్రీవారి విహారం

● వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 20: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవాల్లో మూడో రోజైన శనివారం వేకువజామున మేల్కొలుపు, తీర్థపు బిందెతో విశేష అర్చన, నిత్య హోమం, బలిహరణ, ద్రవి డ వేదపారాయణంలను శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులను దర్శనానికి అనుమతించారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు, ప్రధాన హోమాలు, దిగ్దేవతా బలిహరణలను వైభవోపేతంగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో స్వామివారు పొన్న వాహనంపై ఆశీనులై బాణసంచా కాల్పులు, వివిధ రాష్ట్రాలకు చెందిన కళాకారులు, వేలాది మంది భక్తుల గోవిందనామ స్మరణ మధ్య మాడ వీధుల్లో విహరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శనివారం ఒక్కరోజు ఆదాయం రూ.33.11 లక్షలు

వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువజామునే స్వామివారికి సుప్రభాత సేవ, ఐశ్వర్య లక్ష్మీ హోమం, బాల భోగం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు తిరువీధుల్లో ఏడు ప్రదక్షిణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు బారులుతీరి స్వామివారిని దర్శించుకుని తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.33.11 లక్షలు లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు.





వాడపల్లి వెంకన్న కల్యాణోత్సవాలలో భాగంగా మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న దృశ్యం, పొన్న వాహనంపై విహరిస్తున్న శ్రీవారు

టీడీపీ రెబల్ అభ్యర్థిగా వంతల రాజేశ్వరి



విలేఖరుల సమావేశంలో మాట్లాడుతున్న వంతల రాజేశ్వరి

రంపచోడవరం, ఏప్రిల్ 20: అల్లూరి సీతారామరాజు జిల్లా రంపచోడవరం నుంచి టీడీపీ రెబల్ అభ్యర్థిగా తాను నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి ప్రకటించారు. రంపచోడవరంలో శనివారం ఆమె విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఏడేళ్ల పాటు పార్టీ పటిష్టతకు కృషి చేశానని, చివరివరకు తనకే టికెట్ ఇస్తానని చెప్పి చివరకు ఎటువంటి సభ్యత్వం లేని మిరియాల శిరీషాదేవికి టికెట్ ఇచ్చారన్నారు. తన అనుచరులతో చర్చించిన అనంతరం నామినేషన్ వేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. 11 మండలాల నాయకులు, కార్యకర్తలతో సమావేశమై నామినేషన్ తేదీని ప్రకటించనున్నట్లు రాజేశ్వరి తెలిపారు.

సీఎంకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన
విద్యార్థుల సస్పెండ్ అంటూ ఫేక్ లేఖ

● గండేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆదిత్య కళాశాల యాజమాన్యం ఫిర్యాదు

గండేపల్లి, ఏప్రిల్ 20: సీఎం జగన్‌కు వ్యతిరేకంగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు అనుకూలంగా నినాదాలు చేసిన విద్యార్థులను ఓ ప్రైవేటు కళాశాల యాజమాన్యం సస్పెండ్ చేసిందని పేర్కొంటూ ఓ ఫేక్ లేఖ సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. దీనిపైన చర్యలు తీసుకోవాలంటూ ఆ కళాశాల యాజమాన్యం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సీఎం జగన్ బస్సు యాత్రలో భాగంగా శుక్రవారం కాకినాడ జిల్లా గండేపల్లి మండలం సూరంపాలెం మీదుగా వెళ్తుండగా దారిలో ఆదిత్య కళాశాలవద్ద బస్సు ఆపారు. ఈ సమయంలో పలువురు విద్యార్థులు బాబులకే బాబు కల్యాణ్ బాబు అంటూ సీఎం జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ నేపథ్యంలో సంబంధిత విద్యార్థులపై ఆ కళాశాల చర్యలు తీసుకుని సస్పెండ్ చేసినట్టు ఓ ఫేక్ లేఖ సోషల్ మీడియాలో తిరుగుతోంది. అది ఫేక్ లేఖ అని, అసత్యప్రచారం చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆ కళాశాల యాజమాన్యం శనివారం గండేపల్లి పోలీసులు ఫిర్యాదు చేసింది.

పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సుకు
దరఖాస్తుల ఆహ్వానం

దివాన్‌చెరువు, ఏప్రిల్ 20 : ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా కానవరంలోని శ్రీరాపర్తి రామా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యోగాచే పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వీసీ ఆచార్య కె.పద్మరాజు శనివారం తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ డిప్లమో ఇన్ యోగా ఒక ఏడాది పార్ట్‌టైం కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. నన్నయ ప్రాంగణంతోపాటు కానవరంలోని రాపర్తి రామ సంస్థలో 50 సీట్లు వంతున కోర్సును అందిస్తున్నామన్నారు. వచ్చేనెల 6వ తేదీలోగా ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య జ్యోతిర్మయి, యోగా సంస్థ ప్రతినిధులు రామరాజు శర్మ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

తుని రూరల్, ఏప్రిల్20:తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో వేగుపాలెం, నర్సీపట్నం రైల్వేస్టేషన్ల మధ్యలో గుర్తు రైలు ఢీ కొని సుమారు 65 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మరణించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రి మార్చురీలో భద్రపరిచారు. సంబంధీకులు ఎవరైనా ఉంటే తుని రైల్వేపోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలన్నారు

పుష్పాధివాసంలో
సత్యదేవుడి నూతన ధ్వజస్తంభం

అన్నవరం, ఏప్రిల్ 20: ఈనెల 22న సత్యదేవుడి నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠా కార్యక్రమంలో భాగంగా మూడోరోజు శనివారం ధ్వజాన్ని పుష్పాదివాసంలో ఉంచి పండితులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఈసందర్భంగా రావిచెట్టును ఆనుకుని ఏర్పాటుచేసిన యాగశాలలో ప్రత్యేక హోమాలు, జపములు, పారాయణలను రుత్విక్‌లు శాస్త్రోక్తంగా నిర్వహించారు. 22వ తేదీన నూతన ధ్వజస్తంభం ప్రతిష్ఠ చేయనున్నారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, పండితులు కన్నబాబు, ప్రధానార్చకులు ఇంద్రగంటి నరసింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు. చతుర్వేదపండితులు వేదస్వస్తి గావించారు.



ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న పండితులు

యల్లమిల్లిలో వింత సంఘటన

● నందీశ్వరుడి మూపరం నుంచి కారుతున్న పాలు



యల్లమిల్లిలో నందీశ్వరుడి నడుం నుంచి కారుతున్న పాలు

గండేపల్లి, ఏప్రిల్ 20: కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో యల్లమిల్లి గ్రామంలో శనివారం వింత సంఘటన చోటుచేసుకుంది. గ్రామంలోని నందీశ్వరుడు మూపరంపై నుంచి పాలు కారడంతో గ్రామస్తులంతా పూజలు చేశారు. దైవలీల అని భక్తులంతా కొలిచారు. శుక్రవారం కూడా పాలు కారినట్లు తెలిపారు. ఈ విషయం తెలిసిన చుట్టుప్రక్కల గ్రామస్తులు కూడా విచ్చేసి నందీశ్వరుడికి పూజలు చేపట్టారు.



వింతగా చూస్తున్న భక్తులు

10 సెల్‌ఫోన్లు రికవరీ చేసిన జీఆర్పీ



సెల్‌ఫోన్లను రికవరీ చేసి వాటి యజమానులకు అప్పగించిన రైల్వే పోలీసులు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన 10 సెల్‌ఫోన్లను ప్రభుత్వ రైల్వే పోలీసులు రికవరీ చేశారు. సీఐ విజయ్ శంకర్ వివరాల ప్రకారం.. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వెబ్‌సైటు ద్వారా దొంగతనానికి గురైన రూ.2లక్షల విలువ చేసే 10 సెల్‌ఫోన్లను రికవరీ చేసి వాటి యజమానులకు అప్పగించారు. రికవరీలో ప్రత్యేక శ్రద్ధ చూపిన సిబ్బందిని డీఎస్‌ఆర్పీ ఎల్.మోహనరావు అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు మావుళ్లు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

కందుల దుర్గేష్‌కు
పురందేశ్వరి పరామర్శ



దుర్గేష్‌ను పరామర్శిస్తున్న దగ్గుబాటి పురంధేశ్వరి తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 20: మాతృ వియోగంతో బాధపడుతున్న జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, నిడదవోలు అసెంబ్లీ అభ్యర్థి కందుల దుర్గేష్‌ను బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురంధేశ్వరి శనివారం పరామర్శించారు. దుర్గేష్ మాతృమూర్తి పద్మావతి శుక్రవారం మృతి చెందారు. ఈ వార్త తెలుసుకున్న పురందేశ్వరి, ఆమె భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీవిశ్వనాథరాజు, ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ తదితరులతో కలసి వెళ్లి దుర్గేష్‌ను, వారి కుటుంబ సభ్యులను కలసి సంతాపం తెలిపారు.

జాతీయస్థాయి రగ్బీ పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

గురజనాపల్లి(కరప), ఏప్రిల్ 20: జాతీయస్థాయి రగ్బీ పోటీలకు కాకినాడ జిల్లా కరప మండలం గురజనాపల్లి హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. గతేడాది నవంబరు 20నుంచి 27వ తేదీ వరకు జరిగిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ రగ్బీ పోటీలు జరిగాయి. ఆ పోటీల్లో స్థానిక పాఠశాలలో పదో తరగతి చదువుతున్న జ్యోతి చంద్రిక, సునంద తేజశ్రీలు జిల్లా జట్టు తరఫున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జట్టును ద్వితీయ స్థానంలో నిలిపారు. వారి ప్రతిభను గుర్తించిన సెలెక్టర్లు జాతీయస్థాయి పోటీలకు ఎంపికచేశారు. ఈనెల 27నుంచి 28వ తేదీ వరకు మహారాష్ట్రలోని పూణే ఛత్రపతి శివాజీ స్టేడియం నందు జరిగే 67వ స్కూల్ గేమ్స్ అఖిల భారత రగ్బీ పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరఫున వీరు ప్రాతినిధ్యం వహిస్తారు. క్రీడాకారుల రవాణా ఖర్చుల నిమిత్తం హెచ్‌ఎం ఒక వెయ్యి రూపాయలు అందజేశారు. జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను హెచ్‌ఎం ఎ.సాయిమోహన్, స్టాఫ్ సెక్రటరీ ఐ.ప్రసాదరావు, ఎస్‌ఎంసీ ఛైర్మన్ పబ్బినీడి వీరబాబు, వీవీ రమణమూర్తి, నాగలింగేశ్వరరావు, జి.అర్జునరావు, తదితరులు అభినందించారు.

అనపర్తి ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మిపై
రెండు కేసులు నమోదు

అనపర్తి, ఏప్రిల్ 20: ఎన్నికల నియమావళి ఉల్లంఘనపై అనపర్తి ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్య నారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మిపై అనపర్తి, పెదపూడి పోలీస్‌స్టేషన్లలో రెండు కేసు లు నమోదు చేశారు. ఈనెల 6,7 తేదీలలో అనపర్తి మండలం పొలమూరు, పెదపూడి మండలం కైకవోలు గ్రామాలలో ప్రార్థనా మందిరాలలో ప్రచారం నిర్వహించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు కేసులు నమోదయ్యాయి. ప్రార్థనా మందిరంలో వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సత్తి సూర్య నారాయణరెడ్డికి ఫ్యాన్ గుర్తుపై ఓటువేసి గెలిపించాలని కోరినట్లు అనపర్తి పెదపూడి తహసీల్దార్‌లకు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో అనపర్తి మండలం కోడ్ ఆఫ్ కాండక్ట్ అధికారి ఎంపీడీవో వీవీ రవికుమార్ ఫిర్యాదు మేరకు అనపర్తి పోలీసులు, పెదపూడి మండల కోడ్ ఆఫ్ కాండెక్ట్ అధికారిణి ఎంపీడీవో పి.ఆశాజ్యోతి ఫిర్యాదు మేరకు పెదపూడి పోలీసులు కేసులు నమోదు చేసినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

మార్గదర్శి ఫైనాన్షియల్ వ్యవహారానికి
ఈ ఏడాది చివరికి లాజికల్ ఎండింగ్

● మాజీ ఎంపీ ఉండవల్లి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: మార్గదర్శి ఫైనాన్షియల్ వ్యవహారం ఈ ఏడాది చివరికి లాజికల్ ఎండింగ్‌కు వస్తుందని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాలులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కేసులో సుప్రీంకోర్టు జడ్జిమెంట్ కాపీ వచ్చిందని, అందుకుని వివరాలు వెల్లడిస్తున్నామన్నారు. ఈ కేసులో 45ఎస్ వర్తిసుందా? వర్తించదా? అనే అంశంపై కేసు నడిచిందన్నారు.

ఉత్తరకంచి బ్యాంక్ దోపిడీ కేసులో మరో నిందితుడి అరెస్ట్

ప్రత్తిపాడు, ఏప్రిల్ 20: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి బ్యాంక్ దోపిడీ కేసులో శనివారం మరో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో రెండు విడతలుగా ఇప్పటికే ఐదుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. తాజాగా ఏ7 నిందితుడిని అరెస్ట్ చేయడంతో అరెస్ట్ చేసిన వ్యక్తుల సంఖ్య ఆరుకు చేరింది. ఉత్తరకంచి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రలకు చెందిన ఏడుగురు దుండగులు చోరీకి పాల్పడి భారీ ఎత్తున బంగారం, నగదు దోచుకున్నారు. దీనిపై జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించి పలు బృందాలు ఏర్పాటుచేసి ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రల్లో గాలింపుచర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మార్చి7న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేయగా, ఏప్రిల్7న మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. శనివారం ఈ కేసులో ఏ7 నిందితుడు మహారాష్ట్రలోని ఉడానా జిల్లా చిక్కిలి తాలూకాకు చెందిన చాకస్ అనే నిందితుడిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం

కడియం, ఏప్రిల్ 20: కడియపులంక హరిహర మహాక్షేత్రంలో శ్రీదేవి-భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయం ఎదుట ఏర్పాటుచేసిన వేదికలో కల్యాణాన్ని పం డితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయం చైర్మన్, టీడీపీ రాష్ట్ర నాయకులు మార్గాని సత్యనారాయణ, మాజీ ఎంపీ మార్గాని లక్ష్మీదంపతులు సంప్రదాయంగా పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం మేళతాళా లు, మంగళవాయిద్యాలు, విశేష బాణాసంచా కాల్పులతో అట్టహాసంగా అమ్మవారిని, శ్రీవేంకటేశ్వరస్వామిని కళ్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. ఈ కళ్యాణ మహోత్సవాన్ని భక్తులు, నర్సరీ రైతులు తిలకించారు.

ఏజెన్సీ సమాచారం

మూడో రోజు ఒక్క నామినేషన్

-రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్



నామినేషన్ పత్రం అందిస్తున్న లచ్చిరెడ్డి

రంపచోడవరం, ఏప్రిల్ 20: రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో మూడో రోజు సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ తరపున ఒక నామినేషన్ పత్రం అందిందని రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రంపచోడవరం మండలం భూసిగూడెం పంచాయతీ కొత్తపాకలు గ్రామానికి చెందిన పల్లాల లచ్చిరెడ్డి నామినేషన్ పత్రాన్ని దాఖలు చేశారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి ఎ.కృష్ణజ్యోతి, తహశీల్దారు నాగరాజు, డీటీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, శివ, రామకృష్ణ, చైతన్య, విశ్వనాథ్, సరిత, బాలాజీ, శ్రీధర్, రవీంద్రబాబు, వీరభద్రరావు, సత్యనారాయణ, సీనియర్ సహాయకులు లక్ష్మణరావు, పాలుబాబు, అలెగ్జాండర్ పాల్గొన్నారు.

చంద్రబాబు జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న చందు

ఎటపాక,ఏప్రిల్ 21: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు జన్మదిన వేడుకలను శనివారం మండలంలో ఘనంగా నిర్వహించారు. తోటపల్లి గ్రామంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లభనేని చందు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా జరిపారు. చంద్రబాబు పేరుతో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేసి, కార్యకర్తలు ఆనందోత్సాహాల నడుమ వేడుకలను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పూరేటి వెంకటేశ్వరరావు, టీపీవీడు సర్పంచ్ మోసం రాజులు, బాచినేని మల్లేశ్వరరావు, జనసేన మండలాధ్యక్షుడు మారాసు గంగాధర్, నలజాల ప్రసాద్, దుద్దుకూరి సతీష్, వల్లభనేని భద్రరావు, దుద్దుకూరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబు జన్మదిన వేడుకలు

మోతుగూడెం, ఏప్రిల్ 20: డొంకరాయి గ్రామంలో ఎన్టీఆర్ భవన్‌లో ఎంపీటీసీ కరకా వెంకట రమణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. కార్యకర్తలు కపిల్, సత్యనారాయణ, నరసింహమూర్తి, ప్రేమ్, అనిల్, రాము, రాజు, వేణు, నటరాజ్, మహిళలు పాల్గొన్నారు. అలాగే మోతుగూడెంలో ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు కేక్ కట్ చేశారు. టీడీపీ యువత భీమరాజు, యేసు చిన్న, జాకీర, టీడీపీ సీనియర్ నాయకుడు ఓలయ్య, దొరబాబు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే వై.రామవరం మండలం బొడ్డగంగి పంచాయతీ డొంకరాయి గ్రామంలో శనివారం పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పుట్టిన రోజు సందర్భంగా ఎంపీటీసీ కె. వెంకటరమణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

'ఆదివాసీల హక్కుల సాధనకు ఎన్నికల్లో పోటీ'

రంపచోడవరం, ఏప్రిల్ 20: భారత రాజ్యాంగంలో ఆదివాసీలకు కల్పించిన హక్కులు సంపూర్ణంగా అందేలా కృషి చేయాలనే ప్రధాన ఉద్దేశంతో ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ పార్టీ అసెంబ్లీ అభ్యర్థి కుంజా శ్రీను అన్నారు. ఈ మేరకు ఆయన శనివారం ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. 23న నామినేషన్ వేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీట ప్రసాద్, బొరగ ఎర్రమ్మ, కారు అరుణకుమారి, కుర్సం వరలక్ష్మి, మోడిద నూకరాజు, ముర్ల పురుషోత్తం, చవలం రాంబాబుదొర, చోడి ప్రదీప్‌దొర, చిన్నాలుదొర పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు దోచుకున్నారు

జడ్పీటీసీ వడుగుల జ్యోతి

రాజవొమ్మంగి ఏప్రిల్ 20: ఇటీవల వైసీపీకి రాజీనామా చేసిన జడ్పీటీసీ వడుగుల జ్యోతి మండలంలో వైసీపీ నేతల అక్రమాలను వెల్లడించారు. రాజవొమ్మంగిలో శనివారం ఆమె పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీని, పదవులను అడ్డుపెట్టుకుని తాము దోచుకోలేదని అన్నారు. వైసీపీ మండలాధ్యక్షుడు శింగిరెడ్డి రామకృష్ణ ఎన్నో అక్రమాలు చేశారన్నారు. శింగిరెడ్డి రామకృష్ణ, వైసీపీ మండలాధ్యక్షుడు, సొసైటీ ప్రెసిడెంట్ పదవులను అడ్డుపెట్టుకొని ధాన్యం కొనుగోలులో ఎంతో అవినీతి చేశారన్నారు. మిల్లర్లతో కలిసి అడ్డంగా దోచుకున్నారన్నారు. క్వింటాకు రూ.70 కమీషన్ తీసుకున్నారని ఆరోపించారు. మండలంలో 40 బోర్లు పేరిట దోచుకుంది వైసీపీ మండలాధ్యక్షుడే అని ఆరోపించారు. ఎంపీపీ గోము వెంకటలక్ష్మిని అడ్డుపెట్టుకుని ఆమె భర్త వెంకటేశ్ రాజు చక్రం తిప్పుతున్నారని అన్నారు. వైసీపీ కోసం తమ వ్యాపారాన్ని వదిలి రోడ్డు మీదకు వచ్చామని జడ్పీటీసీ చెప్పారు. జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ మాదిరిగా తాను స్కాములు చేయలేదని, అవినీతికి పాల్పడలేదని అన్నారు. జడ్పీటీసీ భర్త రవి,మాజీ సర్పంచ్ చీడిపల్లి అప్పారావు పాల్గొన్నారు.

150 మందికి కంటి పరీక్షలు

మోతుగూడెం, ఏప్రిల్ 20: చింతూరు మండలం మోతుగూడెం ఏపీ జెన్కో ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఏపీ జెన్కో కల్యాణ మండపంలో శనివారం మోతుగూడెంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. సీలేరు కాంప్లెక్స్ చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్ శిబిరాన్ని ప్రారంభించారు. 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 12 మందికి శస్త్ర చికిత్సల కోసం వైద్యులు సిఫార్సు చేశారు. 33 మందికి కళ్లజోళ్లు ఇచ్చారు. 18 మందికి మందులు పంపిణీ చేసినట్లు శంకర్ ఫౌండేషన్ మేనేజర్ చంద్రశేఖర్ తెలిపారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఏడీలు ఎం.శ్రీనివాసరావు, సుబ్బిరామిరెడ్డి, ఏఈలు రమేష్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఏకలవ్య ప్రవేశ పరీక్షలు ప్రశాంతం

వై.రామవరం, ఏప్రిల్ 20: వై.రామవరం, గిరిజన సంక్షేమ ఏకలవ్య ఆదర్శ పాఠశాలల్లో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ఏకలవ్య ప్రవేశపరీక్షల కన్వీనర్, పి.యర్రగొండ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీపాదరామకృష్ణ తెలిపారు. రంపచోడవరంలో 2, చింతూరులో 2, రాజవొమ్మంగిలో 1 పరీక్షా కేంద్రాల్లో 6,7,8,9 తరగతులకు ప్రవేశ పరీక్షలు జరిగాయన్నారు. 6వతరగతిలో 1844 మందికి 1628మంది, 7వ తరగతిలో 192 మందికి 166 మంది, 8వ తరగతిలో 127 మందికి 112 మంది, 9వ తరగతిలో 73 మందికి 65 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. ఆయా పరీక్షా కేంద్రాలను రంపచోడవరం గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అబుసలీం తనిఖీలు జరిపారు.

చెట్టు నుంచి నీరు

దేవీపట్నం, ఏప్రిల్ 20: కొండ మొదలు సెక్షన్‌లో తెలిపేరు బీట్ పరిధిలోని తెలిపేరు గ్రామ సమీపంలో నల్లమద్ది చెట్టు నుంచి నీరు వచ్చింది. ఎఫ్‌బీవో పి.ప్రతాప రెడ్డి, ఏబీవో పి.కృష్ణారెడ్డి, కొయ్యల గూడెం బేస్ క్యాంపు సిబ్బంది ఫైర్ పాయింట్ అమర్చడానికి వెళ్లి చెట్టుకు గాటు పెట్టగా దాని నుంచి 40 లీటర్ల నీరు ఎనిమిది నిమిషాల పాటు వచ్చినట్లు అధికారులు ఈ సందర్భంగా చెప్పారు.

కూటమి అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమానికి పెద్దపీట

● 28వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి రూరల్ అభ్యర్థి గోరంట్ల



28వ డివిజన్‌లో ప్రచారంలో పాల్గొన్న గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె శిరీష

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: రాష్ట్రంలో టీడీపీ, బీజేపీ, జనసేన కూ టమి అధికారంలోకి వస్తే మహిళా సంక్షేమానికి పెద్దపీట వేస్తామని రాజమహేంద్రవరంరూరల్ ఉమ్మడి అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ పరిధిలోని 28వ డివిజన్ (రూరల్‌వార్డు)లో శనివారం గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె కంఠమనేని శిరీషతో కలిసి ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. గోరంట్ల వినూత్నంగా ప్రచారం చేశారు. షాపులో ప్యాచీలు వేసే వ్యక్తి వద్దకు వెళ్లి రాష్ట్రంలో ఐదేళ్లపాలనలో అతను పడ్డకష్టాలను అడిగి తెలుసుకుంటూ అతని పనికి సహకరిస్తూ ప్యాచీ వేస్తూ ప్రచారం చేశారు. అనంతరం గోరంట్ల మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వస్తే మహిళలందరికీ మహాశక్తి పథకం ద్వారా పథకాల అందజేస్తామన్నారు. ఆర్టీసీ బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామన్నారు. సొంత చెల్లికే న్యాయం చేయలేని జగన్‌ను నమ్మితే మరోసారి మోసపోవాల్సి వస్తోందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే తమ నాయకుడు చంద్రబాబు ఇచ్చిన హామీ ప్రకారమే పింఛను బట్వాడా ఉంటుందన్నారు. వచ్చేనెలలో జరిగే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓట్లువేసి తనను అఖండ మెజార్టీతో గెలిపించాలని, ఎంపీ అభ్యర్థిగా దగ్గుబాటి పురందేశ్వరిని కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు, తెలుగుమహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మజ్జి పద్మవతి, 28వ వార్డు ఇన్‌చార్జి శీలం గోవింద్, రూరల్ టీడీపీ అధ్యక్షుడు మచ్చేటి ప్రసాద్, నాయకులు దాలిపర్తి వేమన, రొంపిచర్ల ఆంటోని దాస్, పల్లి సాయి, బూ రా దుర్గాంజనేయులు, వడ్డి వరప్రసాద్, బంగారు రాజు, చాలుమూరి సత్యనారాయణ, మానుపాటి తాతారావు, పిన్నింటి ఏకబాబు, యర్రమోతు ధర్మరాజు, బొప్పన నాగేశ్వరావు, నిమ్మలపూడి గోవిందు, నల్లం ఆనంద్ కుమార్, కొయ్యన శ్రీనివాస రావు, పాలిక చంద్రశేఖర్, గండి సర్వేశ్వరరావు, జీడీ శ్రీనివాస్ రెడ్డి, పిల్లా తనూజా, మద్దమణి, కోలా వెంకటలక్ష్మి, డెక్క భాను, బంగారు ముంతాజ్, కుంచె కుమారి, మంగ మూర్తి, కొప్పిశెట్టి వెంకటరావు, కొప్పిశెట్టి చిన్ని, కేతా అప్పారావు, చిట్టిబోయిన శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

బడుగు బలహీన వర్గాల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

కడియం/రాజమహేంద్రవరంరూరల్, ఏప్రిల్ 20: బడుగు బలహీన వర్గాల సంక్షేమమే టీడీపీ ధ్యేయం అని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. శనివారం రాజమహేంద్రవరంరూరల్ మండలం హుకుంపేట డి-బ్లాక్‌లో రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కుమార్తె కంఠమనేని శిరీష ఇంటింటా తిరిగి ప్రచారం నిర్వహించారు. సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు.

● తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలు రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు ఆధ్వర్యలో టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి నివాసంవద్ద శనివారం ఘనంగా జరిగాయి. కేకు కట్ చేసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ 74 ఏళ్ల తన జీవిత ప్రయాణంలో, 46 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ప్రజలే తనకు ఊపిరి, ప్రజా సంక్షేమమే తన జీవితం, రాష్ట్ర భవిష్యత్తుకు, భావితరాల బంగారు భవిష్యత్తుకోసం శ్రమిస్తున్న నిరంతర శ్రామికుడు, అమరావతి సృష్టికర్త, నవ్యాంధ్ర నిర్మాత చంద్రబాబునాయుడు అన్నారు. మనందరి కోసం చంద్రబాబు తిరిగి సీఎం అవుతారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు జేఏసీ కన్వీనర్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసు, రాష్ట్ర కాపు జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాష్, టీడీపీ సీనియర్ నాయకులు ఆళ్ళ ఆనందరావు, కూరాడ వెంకటేష్ గాడి శ్రీను, సానా దుర్గాప్రసాద్, సుంకర అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



గోరంట్ల నివాసం వద్ద చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

25న ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్

జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 20: ఈనెల 25న ఏపీ రెసిడెన్సియల్ స్కూల్ అడ్మిషన్ టెస్టు, ఏపీ రెసిడెన్సియల్ జూనియర్ కాలేజీ, డిగ్రీ కళాశాల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. ఏపీ ఆర్ఎస్ కాట్-2024, ఏపీఆర్జేసీ అండ్ డిగ్రీ సెట్- 2024పై శనివారం సాయంత్రం డీఆర్వో చాంబర్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ పరీక్షలు రెండు సెషన్స్‌లో జరుగుతాయన్నారు. ఏపీఆర్ఎస్ కాట్-2024 ఆరు కేంద్రాల్లోను ఉదయం 10 నుంచి 12గంటల వరకు జరుగుతుందని తెలిపారు. రెండో సెషన్ 3 కేంద్రాల్లో ఏపీ ఆర్జేసీ అండ్ డిగ్రీసెట్-2024 పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే హాల్ టిక్కెట్స్ పంపించామన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు, ఆర్ఎంసీ తాగునీరు, వసతి, శానిటేషన్ నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పరీక్షా కేం ద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ఈనెల 27న జిల్లాలోని 11 కేంద్రాల్లో పాలిటెక్నిక్ కమాన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరుగుతుందని, జిల్లాలో 5,844 మంది పరీక్షలకు హాజరవుతారని డీఆర్వో పేర్కొన్నారు.

అనపర్తి రాజకీయ పరిణామాలపై చర్చ

● టీడీపీ ముఖ్య నేతలతో నల్లమిల్లి సమావేశం

అనపర్తి, ఏప్రిల్ 20 : అనపర్తి మండలం రామవరంలో శనివారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. ప్రస్తుత అనపర్తి నియోజకవర్గ రాజకీయ పరిణామాలపై వీరు చర్చించినట్లు సమాచారం. అనపర్తి టికెట్ తిరిగి టీడీపీకే కేటాయిస్తారని వార్తలు వస్తున్న నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఆదివారం పార్టీ అధినేత చంద్రబాబు చేతు ల మీదుగా అభ్యర్థులకు బిఫారమ్ అందించనున్న నేపథ్యంలో అనపర్తి అసెంబ్లీ సీటు మార్పు ప్రకటన వస్తుందన్న సమ యంలో నల్లమిల్లి పార్టీ ముఖ్యనేతలతో సమావేశమై పలు అంశాలపై చర్చించినట్లు సమాచారం. ముందుగా ప్రకటించిన విధంగా అనపర్తి నియోజకవర్గాన్ని తిరిగి తెలుగుదేశం పార్టీకి కేటాయించాలని అనపర్తిలో తెలుగుదేశం నిలవాలి కార్యకర్తలను రక్షించుకోవాలన్న నినాదంతో నల్లమిల్లి చేస్తున్న పోరాటంపై ఆదివారం క్లారిటీ వచ్చే అవకాశం కనిపిస్తుండటంతో ఈ సమావేశం చర్చనీయాంశంగా మారింది.

విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు



చంద్రబాబు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి సిరసపల్లికి తినిపిస్తున్న నల్లమిల్లి

దేశంలోనే ముందు చూపు కలిగిన అతి కొద్ది మంది రాజకీయ నాయకులలో ఒకరిగా పేరొందిన టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయడు విజన్ ఉన్న నాయకుడని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం అనపర్తిలోని పార్టీ కార్యాలయం లో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. నల్లమిల్లి కేక్‌ను టీడీపీ జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు సిరసపల్లికి తినిపించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, జుత్తుగ కృష్ణ, మల్లిడి కృష్ణారెడ్డి, గొలుగూరి భాస్కరరెడ్డి, కర్రి వెంకటరెడ్డి, నూతిక బాబూరావు, ఒంటిమి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రూ.850 కోట్ల విరాళం క్విడ్‌ప్రోకో కాదా

● బీజేపీతో దేశం అన్ని రంగాల్లో వెనుకబాటు ● కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: ఎలక్టోల్ బాండ్ల పేరిట ఆరువేల కోట్లు బీజేపీ దోచుకుందని, 250 కోట్ల బ్యాలెన్స్ షీట్ చూపిన కంపెనీ రూ850 కోట్లు విరాళం ఇచ్చిందంటే దీని అర్థం క్విడ్ ప్రోకో కాదా అని రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరంలోని పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రె స్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పదేళ్ల పాలనలో దేశం అన్నిరంగాల్లోను వెనుకబడిందన్నారు. వీరు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు, ఆర్వోబీలు, నన్నయ యూనివర్శి ఏర్పాటు, గామన్ బ్రిడ్జి నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేసిందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేదని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. గతంలో చంద్రబాబు నిజస్వరూపం గురించి ఒక చరిత్ర -కొన్ని నిజాలు పేరిట డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన పుస్తకం ప్రసావించి అంశాల మాటేమిటని ప్రశ్నించారు. ఆ పుస్తకంలో చంద్రబాబు గురించి చెప్పింది నిజమా కాదా, నిజమైతే ఇప్పుడు ఎలా పొత్తు పెట్టుకున్నారో చెప్పాలన్నారు. ఓట్లు వేసే ప్రజలు అభ్యర్థుల నిజస్వరూపాలు తెలుసుకోవాలన్నారు. ఈ దేశానికి, రాష్ట్రానికి న్యాయం జరగాలంటే, ప్రత్యేక హోదా రావాలంటే, పోలవరం పూర్తి కావాలన్నా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఎంపీగా తనను, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈనెల 22న తాను నామినేషన్ వేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ ప్రముఖనేత రఘువీరారెడ్డి హాజరౌతారని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, రాజానగరం అభ్యర్థి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని జగన్ అప్పుల ఊబిలోకి నెట్టేశాడు

» రీల్స్ స్టార్ భరత్‌రామ్ ఎమ్మెల్యేగా పనికిరాడు
» అధికారమివ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తాం
» ఇంటింట ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: సంపద సృష్టించడం చేతకాని జగన్ ఈ రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో నెట్టేశాడని ఇటువంటి వాడి అవసరం రాష్ట్రానికి లేదని టీడీపీ-జనసేన-బీజేపీ రామహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 13వ డివిజన్‌లో డైమండ్ పార్కు ప్రాంతంలో శనివారం టీడీపీ అంగన్‌వాడీ కమిటీ అధికార ప్రతినిధి కప్పల వెలుగుకుమారి, డివిజన్ కమిటీ ప్రెసిడెంట్ నగరబోయిన రామకృష్ణ, రాజమహేంద్రవరం పార్లమెంట్ ఎన్నికల సెల్ ప్రధాన కార్యదర్శి బొర్రా చిన్ని, ఉపాధ్యక్షుడు రాయి అప్పన్నబాబు స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఒక్కసారి అవకాశం ఇచ్చిన పాపానికి రాష్ట్రాన్ని 25 ఏళ్లు వెనక్కి తీసుకుపోయిన ఘనుడు జగన్ అని అన్నారు. రాష్ట్రాన్ని దోచుకుని, అందిన కాడికి అప్పులు చేసి అగాధంలోకి రాష్ట్రాన్ని నెట్టివేశాడన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలు ఇస్తున్నానని సవాలక్ష నిబంధనలు పెట్టి కోతలు పెట్టాడని అంతే కాకుండా రూ.10 ఇచ్చి దొడ్డి దారిన రూ.100 లాగేశాడన్నారు. సంపద సృష్టించడం చేతకాదు, పరిశ్రమలు తీసుకురావడం చేతకాని వాడు పాలనకు పనికి రాడన్నారు. ఇక ప్రతి పనిలోను 25శాతం కమిషన్‌తో ప్రజాధనాన్ని దోచిన భరత్‌రామ్‌కు ప్రజాప్రతినిధిగా వుండే అర్హత లేదన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వాడిని ఎమ్మెల్యేగా చేయకూడదని ప్రజలు ఫిక్స్ అయ్యారన్నారు. భరత్‌రామ్‌కు ఓటమి తప్పదన్నారు. నగర ప్రజల ఆశీస్సులతో తాను 50వేల పైబడి భారీ మెజార్టీ సాధిస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ నగర అధ్యక్షుడు రెడ్డి మణి, కడలి రామకృష్ణ, సూరంపూడి శ్రీహరి, టీడీపీ,జనసేన,బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కూటమి విజయం ఖాయం: ఆదిరెడ్డి

రాష్ట్ర ప్రజలు ఫిక్స్ అయ్యారని, ఈ వైసీపీ దగాకోరు నేతలు ఎంత మభ్యపెట్టినా వారి మాయలో పడేందుకు ప్రజలు సిద్ధంగా లేరని టీడీపీ సీనియర్ నేత మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు విజనరీతో రాష్ట్రం అభివృద్ధిలో పరుగులు పెడుతుందన్నారు. కూటమి అధికారంలోకి వస్తే ప్రజలకు సంక్షేమం చేరువచేసి రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తారని చెప్పారు. జగన్ బస్సుయాత్రకు జనం లేరని అన్నారు. బస్సుయాత్ర చేస్తున్న జగన్‌కు ఉమ్మడి తూర్పుగోదారి జిల్లాలో ఒక ఇంజనీరింగ్ కాలేజీ వద్ద విద్యార్థులు దిమ్మతిరేలా నినాదాలతో బుద్ధి చెప్పారన్నారు. తూర్పుగోదావరి జిల్లాలోప్రవేశించిన నాటి నుంచి ప్రజాదరణ లేదన్నారు. రాజమహేంద్రవరం సిటీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ నామినేషన్‌కు వచ్చిన ప్రజలను చూసి వైసీపీ నాయకులు గుండెల్లో రైళ్లు పరిగెట్టాయని అందుకే ఒక్కమాట కూడా మాట్లాడకుండా మౌనంగానే జగన్ వెళ్లిపోయాడన్నారు. కూటమి విజయానికి రాజమహేంద్రవం నుంచి శ్రీకారం చుడుతున్నామని ప్రజల ఆశీర్వాదంతో ఎంపీ, ఎమ్మెల్యే సీట్లును భారీ మెజార్టీతో గెలుస్తామన్నారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వస్తుందన్నారు.



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్



మహిళను ఓటు అభ్యర్థిస్తున్న ఆదిరెడ్డి వాసు

గన్ని కృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం

కూటమి రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్‌ను, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ఆధ్వర్యంలో స్థానిక 50 డివిజన్‌లో ఇంటింట ప్రచారం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవనీకుమార్, మరుకుర్తి రవియాదవ్ ఈ ప్రచారం చేశారు. ఇంటింటికీ కరపత్రాలు పంచారు. కార్యక్రమంలో జక్కంపూడి అర్జున్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థిగా 'మేడా' నామినేషన్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: రాజమహేంద్రవరం అసెంబ్లీ నియోజకవర్గానికి రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థిగా ఆ పార్టీ వ్యవస్థాపకుడు మేడా శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. శనివారం ఆర్యాపురంలోని పార్టీ కార్యాలయం నుంచి ఊరేగింపుగా ఆర్‌వో కార్యాలయానికి చేరుకుని నామినేషన్‌ను దాఖలు చేసారు. కార్యక్రమంలో ఈ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్వతంత్ర అభ్యర్థి నామినేషన్

రాజానగరం, ఏప్రిల్ 20 : రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థిగా బర్రే ఆనంద్‌కుమార్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణికి అందజేశారు. దీంతో నియోజకవర్గంలో వైసీపీ తరపున ఎమ్మెల్యే రాజా, ఆ యన సతీమణి రాజశ్రీ నామినేషన్లు దాఖలు చేయగా, స్వతంత్ర అభ్యర్థిగా ఆనంద్‌కుమార్ ఒక నామినేషన్ దాఖలు చేయడంతో నియోజకవర్గంలో మూడు నామినేషన్లు దాఖలు చేశారు.

జైభీమ్ భారత్ పార్టీ అభ్యర్థిగా గంగాధర్ నామినేషన్

అనపర్తి, ఏప్రిల్ 20: అనపర్తి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థిగా జైభీమ్ భారత్ పార్టీ తరపున లింగం గంగాధర్ శనివారం అనపర్తిలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేశారు.

చంద్రబాబుకు ప్రజలే ఊపిరి

» టీడీపీ అధినేత పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే గోరంట్ల



ఆదిరెడ్డి వాసుకు కేక్ తినిపిస్తున్న పురందేశ్వరి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 76 పుట్టినరోజు రాజమహేంద్రవరంలో ఘనంగా జరిగింది. కేక్‌ను బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ కట్ చేశారు. ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి తన నివాసంలో కాపు జేఏసీ సమక్షంలో కేక్ కట్‌చేశారు. ఈ సందర్భంగా కాపు జేఏసీ నాయకులు గోరంట్లను సత్కరించారు. ఈ సందర్భంగా గోరంట్ల మాట్లాడుతూ 76 ఏళ్ల జీవిత ప్రయాణంలో 46 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో ప్రజలే తనకు ఊపిరి, ప్రజా సంక్షేమమే జీవితంగా భావించి నేటికీ శ్రమిస్తున్న గొప్ప విజనరీ నేత చంద్రబాబు అని అన్నారు. ఈ సందర్భంగా తొలుత జరిగిన విలేకరుల సమావేశంలో కాపు జేఏసీ కన్వీనర్ వాసిరెడ్డి ఏసుదాసు, ఆకుల రామకృష్ణ, ఆకేటి ప్రకాష్, ఆళ్ల ఆనందరావు, ఐటీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు కోరాడ వెంకటేష్, అమ్మన స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు సుంకర అన్నపూర్ణ మాట్లాడారు. కాపులను జగన్ మోసం చేశాడని ధ్వజమెత్తారు. కూటమికి తమ మద్దతు ప్రకటించారు. అలాగే స్థానిక 3వ డివిజన్‌లో శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేసి స్వీట్లను పంచారు. రాష్ట్ర భవిష్యత్ చంద్రబాబుతోనే ఉందన్నారు. సుబ్బారావుపేట రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బొమ్మన షైన శ్రీనివాస్, జక్కంపూడి అర్జున్, టేకుమూడి బద్రీనాథ్, ఆటోనగర్ యూనియన్ ఉపాధ్యక్షుడు గుబ్బల శ్రీనివాస్, షేక్ అహ్మద్ ఉన్నిషా బేగం తదితరులు పాల్గొన్నారు.

గన్ని కృష్ణ ఆధ్వర్యంలో.. చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా మోరంపూడిలోని గన్నిస్ శుభమస్తు వద్ద టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గన్ని కృష్ణ ఆధ్వర్యంలో జీకే స్పందన చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గన్ని కృష్ణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి రాంబాబు ప్రారంభించారు. జగన్ నిర్వాకంతో అంధకారంలో ఉన్న రాష్ట్రానికి వెలుగునిచ్చే మహోన్నత వ్యక్తి చంద్రబాబు అని గన్ని కృష్ణ అన్నారు. అనంతరం కాశి నవీన్‌కుమార్, రాచపల్లి ప్రసాద్ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యర్రా వేణుగోపాలరాయుడు, వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణి, మరుకుర్తి రవియాదవ్, ఉప్పులూరి జానకిరామయ్య, యిన్నమూరి రాంబాబు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల్లో అసంతృప్తే

● రాజకీయ పరిశీలకులు కృష్ణ, వినయ్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: రాష్ట్రంలో జగన్ పరిపాలనపై ప్రజలందరు విసుగు చెంది అసంతృప్తితో ఉన్నారని రాజకీయ పరిశీలకులు గంధం కృష్ణ, వుప్పాల వినయ్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి అధికారం ఇచ్చినందుకు ఐదేళ్ళలో పనికిరాని సలహాదారులకు లక్షల జీతాలు ఇచ్చి ఒక్కటీ పనికొచ్చేపని చేయలేదన్నారు. జగన్ పుణ్యమంటూ రాష్ట్రం 20 ఏళ్లు వెనక్కిపోయిందన్నారు. ఉపాధి లేక యువత పెడదారి పడుతున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చేసాడన్నారు. విశాఖను ఎందుకు రాజధాని అంటున్నాడో డ్రగ్స్ కంటైనర్ పట్టుబడేవరకు అర్థం కాలేదన్నారు. చీప్‌లిక్కరు, కల్తీ మద్యంతో ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకున్నారని కృష్ణ, వినయ్ అన్నారు. నిజంగా జగన్ అభివృద్ధి చేసి వుంటే ఈ రోజు బస్సుయాత్రలు చేయాల్సిన అవసరం లేదన్నారు. సీపీఎస్ రద్దుచేయలేదని, డీఎస్సీ లేదని నవరత్నాలు రాలిపోయాయని, ప్రజలను నట్టేట ముంచాడని అన్నారు.




టీడీపీ, జనసేన జెండాతో పవన్ అభివాదం

ఎన్నికల ప్రేమ!

నాడు.. నేను విన్నాను.. నేను చూశాను.. నేను ఉన్నాను అన్నావ్.. నువ్వు చెప్పినదంతా నిజమే అనుకున్నాం.. ఓట్లేసి గెలిపించాం.. నువ్వు చూసిందేంటి జగనన్నా.. నువ్వు విన్నదేంటి జగనన్నా..!? మా కష్టాలు.. కన్నీళ్లు నీకెందుకు..! మాకు ఏదో చేస్తానన్నావ్.. ఎంతో చేస్తానన్నావ్.. తీరా చూస్తే అందరితో కలిపేశావ్.. పథకాలన్నీ ఎత్తేశావ్.. పింఛన్లు పెంచలేదు.. మాకు మాటరాదు.. చూపులేదు.. కాళ్లులేవు.. ఎందుకంటే మేం దివ్యాంగులం.. ఏ పనీచేయలేం.. నువ్వు ఇచ్చే దాంతో ఎలా బతుకుతామనుకున్నావ్.. ఐదేళ్ల తరువాత మళ్లీ ఇప్పుడు వచ్చేసి ఓట్లు ఎలా అడుగుతున్నావ్ జగనన్నా.. ఎక్కడ చూసినా.. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎటు చూసినా ఇదీ దివ్యాంగుల ప్రశ్న..!?



పాదయాత్రలో దివ్యాంగుడి సమస్యలు వింటున్న జగన్(ఫైల్)

ఏం విన్నావ్.. ఏం చూశావ్!

జగన్ సర్కారులో.. దివ్యాంగులూ విలపింఛన్

దివ్యాంగుల పెన్షన్ పెంచింది చంద్రబాబే..



దివ్యాంగులకు పెన్షన్ మంజూరు చేసింది టీడీపీయే. దివ్యాంగుల పెన్షన్ రూ.3 వేలకు పెంచి ఇచ్చిన ఘనత చంద్రబాబుదే. పెన్షన్ పెంచాలని జగన్ దృష్టికి ఎన్నిసార్లు తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో దివ్యాంగులకు సబ్సిడీ రుణాలిచ్చారు. జగన్ ప్రభుత్వం ఒక్క సబ్సిడీ రుణం అందించలేదు. టీడీపీ మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే దివ్యాంగులకు రూ.6 వేలు పెన్షన్ అందిస్తామని ప్రకటించడం శుభపరిణామం.
కేపీఎస్వీ.నాగరాజు, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకుడు, కోనసీమ

- దివ్యాంగులపై చిన్నచూపు
- 3 జిల్లాల్లో 2.56 లక్షల మంది
- పథకాలన్నీ కట్ చేసిన జగన్
- సంక్షేమం గాలికొదిలేశారు
- ఐదేళ్లగా అందని సాయం
- నేటికీ రూ.3 వేల పెన్షనే..

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/ (రాజమహేంద్రవరం,ఆంధ్రజ్యోతి)/పిఠాపురం/పిఠాపురం రూరల్ : వారంతా దివ్యాంగులు..అందుకే వారిని అణగదొక్కినా గొంతెత్తలేరనుకున్నట్టున్నారు.. అందుతున్న పథకాలను ఆపేస్తే అడగలేరనుకున్నారు.. ఇచ్చే ప్రోత్సాహకాలకు కత్తెర వేస్తే కన్నెర్రజేసేవారు లేరనుకున్నారు.. స్వయం ఉపాధిని ప్రోత్సహించి వారికి మెరుగైన జీవితం కల్పించకపోయినా నిలదీసే దిక్కె వరు అనుకున్నారు. అందుకే జగన్ పాలనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 2.56 లక్షలమం ది దివ్యాంగులు సమిధలుగా మారారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో పూర్తిగా నయవంచనకు గుర య్యారు. అంతకు ముందు చంద్రబాబు పాలనలో అందుతున్న సంక్షేమం మొత్తాన్ని నీరు గార్చేశారు.వారికి అందే ప్రతి పథకానికి పాతరేసేశారు. వెరసి దివ్యాంగుల సంక్షేమంతో ఆటలాడుకున్నారు. పింఛన్లను ఒక్కపైసా పెంచలేదు.రుణాల్లో రాయితీలను ఎత్తేశారు. కల్యాణమస్తు లబ్ధిదారుల సంఖ్యలోనూ కోత పెట్టేశారు. ఉద్యోగాల్లో 5 శాతం రిజర్వేషను కాగితాలకే పరిమితమైంది. చివరికి వారి ఉపాధికి ఊతకర్ర సాయం కూడా జగన్ చేయలేదు.అధికారంలోకి వచ్చాక మీ అన్న మిమ్మల్ని అన్ని విధాలుగా ఆదుకుంటాడని గత ఎన్నికల్లో జగన్ ఇచ్చిన హామీకి అంగవైకల్యం పట్టుకొంది.

పింఛన్.. వంచన..

వైసీపీ ప్రభుత్వం దివ్యాంగులకు సకలాంగులతో సమానంగానే పింఛను ఇస్తోంది తప్ప ఒక్క పైసా పెంచలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో దివ్యాంగులకు ప్రత్యేకంగా రూ.3 వేల పెన్షన్ ఇచ్చేశారు. నేటికీ అదే పెన్షన్ ఇస్తున్నారు. ఈ ఐదేళ్లలో ఒక్క పైసా కూడా పెంచలేదు. ఇంటి స్థలం ఉన్నా, 300 యూనిట్ల కరెంటు బిల్లు వచ్చినా పింఛన్లు కట్ చేశారు. దివ్యాంగత్వం రాకముందు ఆస్తులు ఉంటే వాటినీ పరిగణనలోకి తీసుకొని పింఛన్లు పీకేశారు. విద్యుత్ వినియోగం, కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి, ఆదాయపు పన్ను చెల్లించడం, 3 ఎకరాలకు మించి వ్యవసాయ భూమి, నాలుగు చక్రాల వాహనం, పట్టణాల్లో వెయ్యి చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇల్లు వంటి షరతులను విధించి దివ్యాంగుల్లోని చేయూత లబ్ధిదారులను వడ పోశారు. దీంతో చాలా మంది దివ్యాంగుల జీవితాలు చిన్నాభిన్నమయ్యాయి.

గత ప్రభుత్వంలో 'సదరం' సర్టిఫికెట్లు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పొందే అవకాశం ఉండేది.ఈ ప్రభుత్వం దాన్నీ జటిలం చేసేసింది. సదరం కోసం దివ్యాంగులు మీసేవ కేంద్రాలు, కంప్యూటర్ సెంటర్లు, సదరం క్యాంపులు, అధికారుల కార్యాలయాల చుట్టూ అతికష్టంపై తిరగడమే సరిపోతోంది.

ఐదేళ్లలో ఇచ్చింది 210 వాహనాలే

గత టీడీపీ ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాలోని 2.65 లక్షల మంది దివ్యాంగులకు వారి చదువులను బట్టి ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ కింద రూ.34 వేల నుంచి రూ.50 వేల వరకు ఉపకార వేతనాలు అందించేది.కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక బటన్ నొక్కుడు కిందకు చేర్చి కోతలు కోసేసింది. దివ్యాంగులకు చంద్రబాబు ప్రభుత్వంలో ఐదేళ్లలో కోతలు లేకుండా ద్విచక్ర వాహనాలను వేలల్లో అందించింది.కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక ఐదేళ్లలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కేవలం 210 మాత్రమే వాహనాలు ఇచ్చి చేతులు దులిపేసుకుంది. ఇందు లోను అధికార పార్టీ నేతల సిఫార్సులు ఉన్న వారికే..ఆమ్యామ్యాలు పుచ్చుకుని అందించారు.

ఉద్యోగాల కల్పనేది..

వికలాంగ రిజర్వేషన్ కేటగిరిలో ఉన్న ఉద్యోగాల భర్తీ మాటే మరిచిపోయారు. పీహెచ్ కోటాలో బ్యాక్‌లాగ్ ఉద్యోగాల భర్తీకి గత ప్రభుత్వ హయాంలో స్పెషల్ రిక్రూట్‌మెంట్ నిర్వహించి ఉద్యోగాలను భర్తీ చేసేవారు. వైసీపీ ప్రభుత్వం ఈ విషయాన్నే విస్మరించింది. ఉద్యోగాల ప్రత్యేక భర్తీని చేపట్ట లేదు. కొవిడ్ సమయంలో వికలాంగులను ప్రత్యేకంగా ఆదుకునేందుకు ఎటువంటి చర్యలు చేపట్టకపోవడం విమర్శలకు గురైంది.

రాయితీలు ఎక్కడ?

దివ్యాంగులను ఎవరైనా సాధారణ వ్యక్తులు వివాహం చేసుకుంటే వివాహ ప్రోత్సాహక బహుమతి కింద చంద్రబాబు ప్రభుత్వం లక్ష బహుమతి అమలు చేసింది. వివాహమైన ఏడాదిలోపు ఎప్పు డైనా దరఖాస్తు చేసుకునే వెసులు బాటు కల్పించింది. కానీ జగన్ ప్రభుత్వం వచ్చాక ఆ నిబం ధనను ఎత్తేసి వివాహమైన 15 రోజుల వ్యవధిలో మాత్రమే దరఖాస్తు నిబంధన పెట్టి వారి ఉసురు తీసింది. దివ్యాంగుల్లో అర్హులకు రూ.లక్ష సబ్సిడీని టీడీపీ ప్రభుత్వం అందించి స్వయం ఉపాధిని ప్రోత్సహిస్తే జగన్ సర్కారు వచ్చాక అవన్నీ ఎత్తేసింది.జాతీయ గ్రామీణ ఉపాధి పథకంలో దివ్యాంగులకు తక్కువ ఒత్తిడి ఉన్న పనులనే కల్పించాలి. తక్కువ సమయం పనిచేసినా పూర్తి వేతనం చెల్లించాలి. అసలు పనిలోకే రావొద్దంటూ దివ్యాంగులను పని ప్రదేశాల నుంచి ఉపాధి అధికారులు పంపివేస్తున్నారు. కొత్తగా రుణాలు ఇవ్వడంలేదు. కనీసం వారికి ఉపాధి కల్పించే దిశగా చర్యలు చేపట్టడం లేదు. దివ్యాంగులకు ప్రత్యేకంగా నూరుశాతం హౌసింగ్ రుణాన్ని సబ్సిడీగా అందించేవారు. ఇప్పుడు దాన్ని ఎత్తివేసి అందరితో సమానంగానే రుణాలు ఇస్తున్నారు. గతంలో నెలకు 35 కిలోల బియ్యాన్ని ఉచితంగా ఇచ్చేవారు. ఇప్పుడు దాన్ని అమలు చేయడం లేదు.

ఆ శాఖలు పని చేస్తున్నాయా?

దివ్యాంగుల సంక్షేమం, అభివృద్ధికి దివ్యాంగ సంక్షేమశాఖతోపాటు దివ్యాంగ సంక్షేమ కార్పొరేషన్ కూడా ఉంది. కానీ, వారివద్ద దివ్యాంగులకు సంబంధించిన లెక్కలు కూడా లేవు. కార్పొరేషన్ ద్వారా ట్రైసైకిళ్లు, సెల్‌ఫోన్లు వంటివి ఇవ్వడం తప్ప ఉపాధికి ఎలాంటి సహాయమూ అందడం లేదు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలకు కలిపి కాకినాడలో మాత్రమే కార్యాలయాలు ఉన్నాయి. వాటి విభజన జరగకపోవడంతోపాటు సిబ్బంది కొరత కూడా ఉండడంతో దివ్యాంగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ సూరింటెండెంట్, ఓ అటెండరుతో మూడు జిల్లాల దివ్యాంగుల సంక్షేమానికి, అభివృద్ధికి సంబంధించిన కార్యాలయం నడుస్తోంది.

నాడు టీడీపీలో ఇచ్చిందే.. ఐదేళ్లూ పెంచలేదు..



వైసీపీ వచ్చాక దివ్యాంగులను గాలికొదిలేసింది. టీడీపీ హయాంలో చంద్రబాబు అమలు చేసిన పథకాలు తప్ప వైసీపీ ఒక్క పథకం అమలు చేయలేదు. టీడీపీ హయాంలో ఇచ్చిన రూ.3 వేలు పెన్షనే ఈ ఐదేళ్లూ అందింది.. ఒక్క రూపాయి పెంచలేదు. నియోజకవర్గంలో సుమారు 10 వేల మందికి పైగా దివ్యాంగులు ఉన్నారు. వీరిలో చాలా మందికి కోతలు పెట్టారు. వైసీపీ ప్రభుత్వం వల్ల తమకు ఒరిగిందేమీ లేదు. - **గింజాల దుర్గాప్రసాద్‌యాదవ్, దివ్యాంగుల ప్రతిభావంతుల మండలాధ్యక్షుడు, సూరంపాలెం**

దివ్యాంగులకు వైసీపీ చేసిందేంలేదు..



తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు దివ్యాంగులకు ఇచ్చిన రూ.3 వేల పెన్షనే ఇప్పుడు వైసీపీ ప్రభుత్వం కూడా ఇస్తూ వస్తుంది. దివ్యాం గుల ఉపాధి కల్పన.. అభి వృద్ధికి వైసీపీ ప్రభుత్వం ప్రత్యేకంగా తీసుకున్న చర్యలు శూన్యం.
- అంగర శ్యామ్ గౌడ్, నిడదవోలు

మమ్మల్ని ఓటు బ్యాంకుగానే చూశారు



ఐదేళ్లలో 8.4 లక్షల మంది ఉన్న దివ్యాంగులకు ఇతరులతో కలిపి ఒకటే పెన్షన్ అమలుచేశారు. దివ్యాంగులను కేవలం ఓటు బ్యాంకుగానే చూడడం దురదృష్టకరం. ఈ ఐదేళ్లలో దివ్యాంగులను యాచకుల స్థాయికి దిగజార్చారు. ఈ ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెపుతాం.
- సలాది ఎస్ఎన్ మూర్తి, రాజోలు

హామీలను విస్మరించిన జగన్..



వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలను పక్కన పెట్టింది. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలను జగన్ విస్మరించారు. కమ్యూనిటీ హాళ్లు నిర్మించలేదు. పింఛన్‌ను రూ.6 వేలకు పెంచాలని చేసిన అభ్యర్థనను చంద్రబాబు అంగీకరించారు. - **షేక్ నబీ, దివ్యాంగుల సంఘ నాయకుడు, మండపేట**

పింఛన్లు పెంచింది చంద్రబాబే..



మాకు ఇస్తున్న పింఛను చాలట్లేదు.గత టీడీపీ ప్రభుత్వంలోనే రూ.3 వేల పెన్షన్ ఇచ్చారు.. ఇప్పుడు జగన్ అదే ఇస్తున్నారు. మాకు పింఛన్లు పెంచింది చంద్రబాబు నాయుడే. ఈ సారి వస్తే మళ్లీ ఖచ్చితంగా పెంచుతారు. జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో పెంచిన పింఛను కేవలం వెయ్యి మాత్రమే. - **ఇళ్ల రాణి, నేలటూరు, కపిలేశ్వరపురం మండలం**

మా ఆశను.. నిరాశగా మార్చారు..



వైసీపీ ప్రభుత్వంలో మాకు మేలు జరగలేదు. జగన్ వస్తే ఏదో చేస్తారనుకున్నాం.. కానీ చేసిందేం లేదు. మా ఆశను నిరాశగా మార్చారు. ప్రత్యేక రాయితీలు కల్పించాలి. మండల స్థాయిలో కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలి. బయట తిరిగేందుకు బ్యాటరీ వాహనాలు ఇవ్వాలి.
- టేకి దుర్గాభవాని, కపిలేశ్వరపురం మండలం

రూ.6 వేలు పింఛన్ ఇవ్వాలి..



రూ.250 ఉన్న పింఛన్‌ను రూ.2 వేలు చేసిన ఘనత చంద్రబాబుదే. మేము మనుగడ సాగిం చాలంటే రూ.6వేలు ఇవ్వాలి. రేషన్ డిపోల ద్వారా నిత్యావసర సరుకులు అందించాలి. దివ్యాంగుల మేలు చేసే పార్టీకే ఓటు వేస్తాం.- **సిద్ధాంతపు చిట్టమ్మ, మండపేట**

జగన్ అన్యాయం చేశారు..



వైసీపీ పాలనలో దివ్యాంగులకు అన్యాయమే జరిగింది. జగన్ హామీలను నెరవేర్చలేదు.పీహెచ్ రిజర్వేషన్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీని ప్రభుత్వం విస్మరించింది. పింఛన్ మొత్తాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి అమలు చేయలేదు.
- ఆనాల వీరబాబు, దివ్యాంగుల రాష్ట్రీయ సేవాసమితి ప్రతినిధి, కోలంక, పిఠాపురం

కాలు లేకున్నా.. పింఛన్ ఇవ్వరు..



అత్యవసర సమయంలో ఆరోగ్యశ్రీ ఉపయోగపడదు. అర్హత ఉన్నా పింఛను రాదు. ఇదేం ప్రభుత్వం. గతేడాది రోడ్డు ప్రమాదంలో కాలికి గాయమై వైద్యం కోసం ఆరోగ్యశ్రీ కార్డుతో ఆసుపత్రుల చుట్టూ తిరిగినా ఫలితం లేక సొంత సొమ్ము రూ.2 లక్షలు వెచ్చించి వైద్యం చేయించుకున్నా. ఇన్‌ఫెక్షన్ ఎక్కువై కుడి కాలును కోల్పోయా. పింఛనుకు దరఖాస్తు చేసినా ఇప్పటివరకు మంజూరు కాలేదు.
- కొరపాటి ధర్మశేఖర్, దివ్యాంగుడు, గోపాలపురం

కోరుకొండంత అభిమానం



- అదిరిన పవన్ కల్యాణ్ షో
- భారీగా తరలివచ్చిన జనం
- నిండిన కోరుకొండ
- ఎమ్మెల్యే రాజాపై ఫైర్



కోరుకొండలో మాట్లాడుతున్న పవన్ చిత్రంలో పురందేశ్వరి, బత్తుల, జవహర్, బీవీఆర్ చౌదరి

కోరుకొండ/రాజానగరం/దివాన్‌చెరువు, ఏప్రిల్ 20 : సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కోరుకొండ పాత బస్టాండ్ సెంటర్‌లో జరిగిన జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వారాహియాత్ర జన ప్రభంజనంతో సాగింది. సాయంత్రం 5 గంటల నుంచే పవన్‌ను చూడాలని రాజానగరం నలుమూలల నుంచి వేలాదిగా కోరుకొండకు తరలివచ్చారు. కోరుకొండ వీధులన్నీ జనసేన, టీడీపీ, బీజేపీ కార్యకర్తలతో నిండిపోయాయి. పాతబస్టాండ్ సెంటర్‌లో స్టేట్‌బ్యాంక్ ఎదురుగా జాతీయ రహదారి మీద వారాహి వాహనంపై పవన్ ప్రసంగం అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంది. 7.05 గంటలకు వారాహి వాహనంపైకి ఎక్కిన పవన్ 7.20 నుంచి 8.13 గంటల వరకూ ఏకధాటిగా మాట్లాడారు. రాజానగరం నియోజకవర్గం కోరుకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి 1200 ఎకరాల భూమి రిజిస్ట్రేషన్ల సమస్యలను పరిష్కరించే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల ముందు హామీ ఇచ్చి సమస్యను గాలికి వదిలేశారన్నారు. ప్రశాంతంగా ఉండే రాజానగరం నియోజకవర్గంలో జక్కంపూడి కుటుంబం గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌లకు, ఇసుక, మట్టి, కొండల అడ్డాగా మార్చడంపై ఆవేదన వ్యక్తం చేశారు. దివంగత మాజీ మంత్రి జక్కంపూడి రామ్మోహన్‌రావు మంచి కార్మిక నాయకుడని సామాన్య జీవితం గడిపేవారని, ఆయన అంటే ఎంతో గౌరవమన్నారు. అలాంటి మంచి కుటుంబం నుంచి వచ్చిన వారు కూడా జగన్మోహన్ రెడ్డి కారణంగా దోపిడీలకు, కమిషన్లకు కక్కుర్తి పడడం బాధ కలిగిస్తుందన్నారు. 600 ఎకరాల ఆవభూముల కొనుగోలులో కోట్లాది రూపాయల అవినీతి జరిగిందన్నారు. భూ సేకరణ పేరుతో రూ.100 కోట్లు కమిషన్ సంపాదించారని దాంట్లో ఎమ్మెల్యే, జగన్ ఎలా పంచుకున్నారో వారికే తెలియాలన్నారు. గాడాల, తదితర గ్రామాల్లో 150 ఎకరాల ఫైచిలుకు లే అవుట్లు వేసి వారి నుంచి 15 శాతం కమీషన్ వసూలు చేశారన్నారు. ఇళ్ళ పట్టాలు మీద రూ.300 కోట్లు సంపాదించారన్నారు. కోటికేశవరం, కోటి, మునగాల, కూనవరం, కాటవరం తదితర గ్రామాల్లో కొండలు మాయం చేశారన్నారు. రానున్న ఎన్నికల్లో బత్తుల బలరామకృష్ణను ఎమ్మెల్యేగా గ్లాజుగ్లాసుపై, కమలం గుర్తుపై ఓటు వేసి దగ్గుపాటి పురందేశ్వరిని ఎంపీగా గెలిపించాలన్నారు. వైసీపీ గుండాల తాటతీస్తామని, రాజానగరం, రాజమహేంద్రవరం ప్రాంతాల్లో ప్రశాంత వాతావరణం నెలకొల్పుతామన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంట్ కూటమి అభ్యర్థి దగ్గుపాటి పురందేశ్వరి మాట్లాడుతూ వైసీపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు పనులు రివర్స్ టెండరింగ్ పిలుస్తామని చెప్పి సీఎం జగన్ మొత్తం ప్రాజెక్టును రివర్స్‌లో పెట్టారన్నారు. రాజధాని నిర్మాణానికి 34 వేల ఎకరాల భూములు ఇచ్చిన రైతుల జీవితాలు బజారున పడేశారన్నారు. రాష్ట్రం రాజధాని లేకుండా తల లేని మొండెంలా ఉందని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా, కేంద్రంలో ప్రధాని మోదీ వస్తే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. కోరుకొండ మార్కెట్ యార్డు నిర్మాణం చేయలేని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అందమైన భవంతిని మాత్రం కట్టుకున్నారన్నా రు. రాజానగరం నియోజకవర్గ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ జనసేన అభ్యర్థిగా పోటీ చేసేందుకు మొదటి జాబితాలోనే నాకు అవ కాశం కల్పించడమే మనకు పెద్దపండుగ..ఈ సీటును గెలిపించి పవన్‌కల్యాణ్‌కు బహుమతి అందించాలన్నారు.రాజానగరం టీడీపీ ఇన్‌చార్జి బొడ్డు వెంకటరమణచౌదరి మాట్లాడుతూ ఎక్కడ నెగ్గాలో కాదు.. ఎక్కడ తగ్గాలో తెలుసుకోవాలనే పవన్‌కల్యాణ్ ఆలోచనలను ఆదర్శంగా తీసుకుని నేను రాజానగరం నియోజకవర్గం టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉండాలన్నప్పటికీ వెనక్కి తగ్గానన్నారు. ఈ సీటును ముందుగా పవన్‌కల్యాణ్ జనసేనకు ప్రకటించడంపట్ల నేను, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బందిపడ్డ మాట వాస్తవమేనన్నారు. మూడు పార్టీలు ఐక్యమత్యంగా ముందుకు వెళ్లి కూటమి అభ్యర్థులను గెలిపించుకుంటామన్నారు. సభ జరుగుతుండగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు దీనిపై చర్చించుకోవడం కనిపించింది. భారీ జనరేటర్లు ఏర్పాటు చేయడంతో సభ నిర్వహణకు ఎటువంటి ఆటంకం లేకుండా దిగ్విజయంగా సాగింది. సభ అనం తరం పవన్ కల్యాణ్ రోడ్డు మార్గాన గొల్లప్రోలు మండలంలోని చేబ్రోలులోని తన నివాసానికి చేరుకున్నారు. వారాహి యాత్రలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జవహర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు, నీరుకొండ వీరన్న చౌదరి, చిట్టూరి రవీంద్ర పాల్గొన్నారు.






పిఠాపురం మండలం కొత్తపల్లిలో టీడీపీ జెండా ఎగురవేస్తున్న పవన్

పిఠాపురంలో నేను గెలిస్తే.. వర్మ గెలిచినట్టే : పవన్

కొత్తపల్లి, ఏప్రిల్ 20: పిఠాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా తాను గెలిచినా పిఠాపురం టీడీపీ ఇన్‌చార్జి ఎస్వీఎస్ఎన్ వర్మ నెగ్గినట్టేనని ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కె.పవన్‌కల్యాణ్ అన్నారు. కాకినాడ జిల్లా కొత్తపల్లి సురక్ష ప్యాలెస్‌లో శనివారం నిర్వహించిన పిఠాపురం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు జన్మదినం సందర్భంగా ఆ పార్టీ పిఠాపురం ఇన్‌చార్జి వర్మ ఏర్పాటు చేసిన కేక్‌ను పవన్‌కల్యాణ్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పవన్ మాట్లాడుతూ చంద్రబాబును వైసీపీ ప్రభుత్వం కావాలని వేధించడంవల్ల జనసేన రిస్క్ తీసుకొని టీడీపీకి అండగా నిలిచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ 175 స్థానాల్లో పోటీ చేస్తున్నట్టు భావించి మూడు పార్టీల కార్యకర్తలు ఐకమత్యంగా పోరాడి ఉమ్మడి విజయం సాధిద్దామని పిలుపునిచ్చారు.

రేపు చంద్రబాబు రాక

జగ్గంపేటలో బహిరంగ సభకు టీడీపీ అధినేత



జగ్గంపేట, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత నారాచంద్రబాబునాయుడు సోమవారం కాకినాడ జిల్లా జగ్గంపేటలో పర్యటిస్తారని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జగ్గంపేట నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి జ్యోతుల నెహ్రూ శనివారం తెలిపారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా మధురపూడి ఎయిర్‌పోర్ట్ నుంచి 3.05 గంటలకు హెలికాఫ్టర్‌లో బయలుదేరి 3.15 గంటలకు జగ్గంపేట-గోకవరం రోడ్డులోని కోడూరి రంగారావు పొలం వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి జగ్గంపేట మెయిన్‌రోడ్డు సెంటర్‌లో ఏర్పాటు చేసిన బహిరంగసభకు 3.30 గంటలకు చేరుకుంటారు. సాయంత్రం 5 గంటల వరకు సభలో పాల్గొంటారు. అనంతరం 5.10 గంటలకు హెలిప్యాడ్ వద్దకు చేరుకుని హెలికాఫ్టర్‌లో విజయనగరం జిల్లాకు బయలుదేరి వెళ్తారు.శనివారం హెలిప్యాడ్ ప్రాంతాన్ని జ్యోతుల నెహ్రూ, పోలీసులు, అధికారులు పరిశీలించారు.సభకు జగ్గంపేట నియోజకవర్గం నుంచి టీడీపీ, జనసేన నాయకులు, అభిమానులు భారీగా తరలివస్తారన్నారు. ఎండవేడిమికి ఇబ్బంది లేకుండా మజ్జిగ, మంచినీరు, కూలర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

మూడో రోజూ నామినేషన్ల సందడే..



కొవ్వూరులో నామినేషన్ పత్రం అందజేస్తున్న ముప్పిడి సతీమణి సుజాత

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: మూడో రోజు శనివారం నామినేషన్ల పర్వం ప్రశాంతంగా ముగిసింది.ప్రధాన పార్టీల అభ్యర్థులు రెండో సెట్ నామినేషన్లు దాఖలు చేయగా.. చిన్న చిన్న పార్టీల అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేయడం విశేషం. ఇక ఆదివారం సెలవు కావడంతో మరో మూడు రోజులు 25వ తేదీ వరకూ మాత్రమే నామినేషన్లు దాఖలు చేసే అవకాశం ఉంది. తూర్పు గోదావరి జిల్లాలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పది మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారులకు సమర్పించారని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. కొవ్వూరు అసెంబ్లీకి టీడీపీ తరఫున ముప్పిడి సుజాత, వైసీపీ తరఫున తలారి వెంకట్రావు, నిడదవోలు నియోజకవర్గానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా నుంచి ముక్కామల అన్నవర ప్రసాద్, వైసీపీ తరఫున గెడ్డం సుమలత, వైసీపీ తరఫున రెండో సెట్ నామినేషన్‌ను గెడ్డం శ్రీనివాసనాయుడు దాఖలు చేశారు.అనపర్తి అసెంబ్లీ స్థానానికి జైభీమ్‌రావు భారత్ పార్టీ తరఫున లింగం గంగాధర్, రాజానగరం అసెంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా బర్రే ఆనంద్‌కుమార్, రాజమహేంద్రవరం సిటీ అసెంబ్లీ స్థానానికి రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ పార్టీ తరఫున మేడా శ్రీనివాసరావు, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి స్వతంత్ర అభ్యర్థిగా బొద్దాపు శివ విష్ణుప్రసాదరావు, భారత చైతన్య యువజన పార్టీ తరఫున దుగ్గిరాల శ్రీదేవి నామినేషన్ వేశారు.

బీఆర్ అంబేడ్కర్ కోనసీమలో 5..

అమలాపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాలకు ఐదుగురు నామినేషన్లు దాఖలు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి హిమాన్షు శుక్లా తెలిపారు. రాజోలు అసెంబ్లీ స్థానానికి కూటమి అభ్యర్థి దేవ వరప్రసాద్ మూడు సెట్ల నామినేషన్ పత్రాలను జాయింట్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎస్.నుపూర్‌అజయ్‌కు సమర్పించారు. రామచంద్రపురం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున పిల్లి సూర్యప్రకాష్ ఒక సెట్ నామినేషన్ దాఖలు చేయగా స్వతంత్ర అభ్యర్థిగా కాటే సుబ్రహ్మణ్యం నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎస్.సుధాసాగర్‌కు అందించారు. ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి జై భారత్ నేషనల్ పార్టీ తరఫున వనచర్ల బాబ్జీ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎస్డీసీపీ మదన్‌మోహనరావుకు అందించారు. పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా మాకే దేవిప్రసాద్ రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తికి అందించారు.

కాకినాడ జిల్లాలో 6..

కలెక్టరేట్ (కాకినాడ), ఏప్రిల్ 20: కాకినాడ జిల్లాలో శనివారం ఆరు నామినేషన్లు దాఖలు అయ్యాయి. కాకినాడ లోక్‌సభకు పెయ్యల దుర్గాప్రసాద్ ఇండిపెండెంట్‌గా నామి నేషన్ దాఖలు చేశారు. తుని అసెంబ్లీ స్థానానికి వాడబోయిన శివ సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ తరఫున నామినేషన్ వేశారు. కాకినాడ రూరల్ అసెంబ్లీ స్థానానికి చాగంటి సూర్యనారాయణమూర్తి ఇండిపెండెంట్‌గా.కూటమి తరఫున పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) మరో పర్యాయం నామినేషను దాఖలు చేశారు. జగ్గంపేట నియోజకవర్గానికి బాలిరెడ్డి సాల్మన్‌రాజు ఇండిపెండెంట్‌గా, సాదే నరేంద్రబాబు లిబరేషన్ కాంగ్రెస్ పార్టీ తరఫున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి సమర్పించారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

చిన్నపాటి నిర్లక్ష్యంతో పెను ప్రమాదాలు



అగ్నిప్రమాద నివారణ పరికరాల పనితీరును వివరిస్తున్న ఫైర్ సిబ్బంది

కొవ్వూరు, ఏప్రిల్ 20: చిన్నపాటి నిర్లక్ష్యం పెను ప్రమాదాలకు దారి తీస్తుందని కొవ్వూరు అగ్నిమాపక శాఖాధికారి ఏవీఎస్ఎన్ఎస్ వేణు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సమావేశం స్థానిక అగ్నిమాపకశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ విద్యుత్, గ్యాస్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. వేణు మాట్లాడుతూ వారం రోజులుగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రమాదాల నివారణపై సదస్సులు నిర్వహించామన్నారు. ప్రమాద రహిత సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాద నివారణ పరికరాల వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పి.అప్పారావు, సీహెచ్‌వీవీ గంగాధరరావు, ఎం.రవికుమార్, ఎస్.రామకృష్ణ, కె.ధనుంజయరావు, వై.రాంబాబు, ఎమ్.ప్రకాష్‌బాబు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీరామనవమి ఉత్సవాలు



కొవ్వూరు ఫ్యాక్టరీ క్లబ్‌లో పండిత సత్కారం

కొవ్వూరు, ఏప్రిల్ 20: కొవ్వూరు పెండ్యాల వెంకట్రాయుడు మెమోరియల్ క్లబ్‌లో శ్రీరామనవమి ఉత్సవాలు శనివారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల సందర్భంగా కొన్నిరోజులుగా పలువురు ప్రముఖులు పంచాంగ శ్రవణం, భగవద్గీత, రామాయణ ప్రవచనాలు, విష్ణు, లలిత సహస్రనామ పారాయణం, శ్రీరామనవమి, సీతారాముల కల్యాణం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పండితులు దోర్బల ప్రభాకరశర్మ, తూము శ్రీనివాస్, సత్యహర్ష, రెంటాల సాంబశివరావు, కలిగొట్ల కృష్ణారావు, ఇనుగంటి ఉమారామారావు దంపతులను క్లబ్ సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరి జి.త్రినాథ్, జె.రఘు, జీవీఎస్ సంజీవరెడ్డి, చిట్టూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా అన్నవర ప్రసాద్ నామినేషన్



ఆర్వోకు నామినేషన్ అందజేస్తున్న అన్నవరప్రసాద్

నిడదవోలు, ఏప్రిల్ 20: శ్వాస మీద ధ్యాస, ధ్యానంపైనే అతని ప్రచారం. పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ వ్యవస్థాపకుడు పత్రీజీకి ప్రియ శిష్యుడు ముక్కామల అన్నవర ప్రసాద్. ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా శనివారం నాలుగో సారి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనను ఆంధ్రజ్యోతి పలకరించగా తమ పార్టీ అభ్యర్థిగా 2009, 2014, 2019, సంవత్సరాల్లో నామినేషన్ దాఖలు చేశానని, అలాగే ఇప్పుడు కూడా ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ సమర్పించానన్నారు.

44 మంది వలంటీర్లు రాజీనామా

నల్లజర్ల, ఏప్రిల్ 20: మండలంలోని పోతవరంలో రెండు సచివాలయాల్లో పని చేస్తున్న 44మంది వలంటీర్లు రాజీనామా చేశారు. రాజకీయ నాయకుల వత్తిడి మేరకు వలంటీర్లు రాజీనామా చేసినట్టు తెలుస్తోంది. రాజీనామా చేసిన వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని షరతులు పెట్టినట్టు సమాచారం. రెండు నెలలకు సంబంధించి ఒక్కో వలంటీర్‌కు రూ.10 వేలు అందిస్తారనే ప్రచారం జరుగుతోంది.

యాదవ సంఘం నిడదవోలు అధ్యక్షుడిగా గోపి



గోపికి నియామక పత్రం అందిస్తున్న జిల్లా అధ్యక్షుడు సూర్యచంద్రం

నిడదవోలు, ఏప్రిల్ 20: నిడదవోలులోని మదన గోపాలస్వామి ఆలయం వద్ద జరిగిన ఒక కార్యక్రమంలో శనివారం నిడదవోలుకు చెందిన గంగుల గోపియాదవ్‌ను యాదవ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు కవల సూర్యచంద్రం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు యాదవ నాయకులు అభినందించారు. కార్యక్రమంలో గుడ్ల సత్యనారాయణ, తాత రాంబాబు, నాగళ్ల బాలాజీ, ముళ్ళ గోపీ, బొంతా సూరిబాబు పాల్గొన్నారు.

ఎర్ర కాల్వలో పడి వృద్ధుడి మృతి

నల్లజర్ల, ఏప్రిల్ 20: మండలంలోని నబీపేట గ్రామానికి చెందిన మర్రి మారియ్య(56) స్థానికంగా ఎర్రకాల్వలో పడి మృతి చెందాడు. శనివారం ఉదయం ఉపాధి హామీ పనికి వెళ్లి వచ్చి, పాడి గేదెను కాల్వలో కడుగుతుండగా ప్రమాదవశాత్తూ పడి మృతి చెందాడు. స్థానికులు చూసి మృతదేహాన్ని వెలికి తీశారు.

ముందస్తు జాగ్రత్తలతో ప్రమాదాల నియంత్రణ

కొవ్వూరు, ఏప్రిల్ 20: అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని ఆంధ్రా షుగర్స్ భద్రతాధికారి కేవీవీ సత్యనారాయణమూర్తి అన్నారు. కొవ్వూరు ఆంధ్రా షుగర్స్ కర్మాగారంలో ఫ్యాక్టరీ మేనేజర్ ఈవీ కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు అవగాహనా సదస్సులు, పోటీలు, ఫైర్ డ్రిల్స్ జరిపారు. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ప్రమాదాల నివారణకు వినియోగించు పరికరాల ప్రదర్శన ఏర్పాటుచేసి కార్మికులు, ఉద్యోగులకు వాటి ఉపయోగాలను వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ పర్సనల్ మేనేజర్ సీహెచ్ఎస్ మహర్షి, జె.రఘు, జీవీఎస్ సంజీవరెడ్డి, ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, కార్మికులు పాల్గొన్నారు.

మార్గదర్శి ఫైనాన్షియల్ వ్యవహారానికి

ఈ ఏడాది చివరికి లాజికల్ ఎండింగ్

● రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: మార్గదర్శి ఫైనాన్షియల్ వ్యవహారం ఈ ఏడాది చివరికి లాజికల్ ఎండింగ్‌కు వస్తుందని రాజమహేంద్రవరం మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని దర్మంచర కమ్యూనిటీ హాలులో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కేసులో సుప్రీంకోర్టు జడ్జిమెంట్ కాపీ వచ్చిందని, అందుకుని వివరాలు వెల్లడిస్తున్నామన్నారు. ఈ కేసులో 45ఎస్ వర్తిసుందా? వర్తించదా? అనే అంశంపై కేసు నడిచిందన్నారు. 45ఎస్ విషయంలో ఆర్‌బీఐ ఏమి చెప్పిందో మార్గదర్శి తెలుసుకోవాలని, అలాగే తెలంగాణ, ఏపీలను పార్టీలుగా చేస్తూ తెలంగాణ హైకోర్టు పూర్తిస్థాయిలో విచారణ చేయాలని సూచించిందని, అలాగే ఈ కేసులో తాను చెప్పదలచుకున్నది కోర్టుకు చెప్పి సహకరించాలని సుప్రీంకోర్టు ఆదేశించిందన్నారు. హైకోర్టు విచారణ యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించే అవకాశం కల్పించాలని పిటీషన్ వేస్తున్నానని చెప్పారు. ఈ ప్రత్యక్ష ప్రసారానికి అయ్యే ఖర్చును తాను భరిస్తానని చెప్పారు. రేపు ప్రభుత్వం మారితే డిపాజిటర్లకు చెల్లింపులు జరిగిపోయాయని చెప్పినా ఆశ్చర్యపోనవసరం లేదన్నారు. అందుకే తాను చెప్పదలచుకున్నది తాను చెప్పే అవకాశం సుప్రీంకోర్టు ఇచ్చిందన్నారు.

కూటమి అభ్యర్థిగా ముప్పిడి సుజాత నామినేషన్

కొవ్వూరు, ఏప్రిల్ 20: టీడీపీ-జనసేన-బీజేపీ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు సతీమణి ముప్పిడి సుజాత నామినేషన్ దాఖలు చేశారు. ద్విసభ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఆమె రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవకు శనివారం నామినేషన్ పత్రాలను అందజేశారు. ఏపీని రాజధాని లేని రాష్ట్రంగా చేసిన వైసీపీని ఎన్నికల్లో ఓడించాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో ద్విసభ్య కమిటీ సభ్యుడు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి పాల్గొన్నారు.



నిడదవోలులో కేక్ కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి



దేవరపల్లిలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

» మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు

» ఘనంగా టీడీపీ అధినేత పుట్టిన రోజు

నిడదవోలు, ఏప్రిల్ 20: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబుతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. చంద్రబాబు 74వ పుట్టిన రోజు వేడుకలు పలుచోట్ల శనివారం నిర్వహించారు. నిడదవోలులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. చంద్రబాబు పుట్టినరోజు పార్టీ శ్రేణులకు పండగ రోజని శేషారావు అన్నారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, తిరుపతి సత్యనారాయణ, కారింకి నాగేశ్వరరావు, కమల, వెలగన సూర్యారావు, షాజహాన్ పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలోని టీడీపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు గన్నమని హరికృష్ణ, జనసేన నాయకుడు డి.సువర్ధరాజు మాట్లాడుతూ రాష్ట్రప్రయోజనాలు, ప్రజల కోసం నిరంతరం కష్టపడి పనిచేసే వ్యక్తి చంద్రబాబు అని ప్రశంసించారు. మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామీకి సంతోషం వ్యక్తం చేస్తూ మహిళలు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కాట్రు భీమరాజు, కొండపల్లి దొరయ్య, యాగంటి వెంకటేశ్వరరావు, ఉప్పులూరి రామరావు, సింహాద్రి రామకృష్ణ, అనపత్తి వాసు, నందిగం శ్రీధర్, ఎం.రాజేశ్వరి, జనసేన నాయకులు అనిశెట్టి గంగరాజు, కంబాల సత్తిబాబు, సూరిశెట్టి బాలు, మణికంఠ, జాజిమొగ్గల శ్రీను పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లులో మాజీ ఎంపీపీ కేతా సాహెబ్ ఇంటి వద్ద కేక్ కటింగ్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్య యువకుడు చంద్రబాబు రాష్ట్రాభివృద్ధి, పేదల సంక్షేమం కోసం నిరంతరం కష్టపడి పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి, కరుటూరి సతీష్, ఆళ్ల సత్తిబాబు, అల్తాఫ్ అహ్మద్, జుజ్జవరపు శ్రీనివాసరావు, కోడి చంటియ్య కోడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని గోపాలపురం, తొక్కిరెడ్డిగూడెం గ్రామాల్లో జరిగిన చంద్రబాబు పుట్టినరోజు వేడుకల్లో టీడీపీ మండలాధ్యక్షుడు రొంగల సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు. భావితరాల దార్శనికుడు చంద్రబాబు అని, రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం నిరంతరం శ్రమించే చంద్రబాబుకు రాబోయే ఎన్నికల్లో పట్టం గట్టాలన్నారు. కార్యక్రమంలో విష్ణురావు, పడమట నెహ్రూ, కూనపోగు ప్రసాద్‌బాబు, సత్తెనపల్లి శ్రీను, జ్యేష్ట శ్రీధర్, దాసరి రవి, కొడవటి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.



చాగల్లులో సాహెబ్ ఇంటి వద్ద కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు



గోపాలపురం: తొక్కిరెడ్డిగూడెంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం: నన్నయ వీసీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 20: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ద్వారా కానవరంలోని శ్రీరాపర్తి రామా ఇనిస్టిట్యూట్ ఆఫ్ యోగాలో పీజీ డిప్లమో ఇన్ యోగా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని వీసీ ఆచార్య కె.పద్మరాజు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా పోస్టర్‌ను ఆవిష్కరించారు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి పీజీ డిప్లమో ఇన్ యోగా ఒక ఏడాది పార్ట్‌టైం కోర్సు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. నన్నయ ప్రాంగణంతో పాటు కానవరంలోని రాపర్తి రామ సంస్థలో 50 సీట్లు వంతున కోర్సును అందిస్తున్నామన్నారు. వచ్చే నెల 6వ తేదీలోగా ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య జ్యోతిర్మయి, యోగా సంస్థ ప్రతినిధులు రామరాజు శర్మ, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కందుల దుర్గేష్‌కు పురందేశ్వరి పరామర్శ



దుర్గేష్‌ను పరామర్శిస్తున్న పురందేశ్వరి తదితరులు

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 20: మాతృ వియోగంతో బాధపడుతున్న జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, నిడదవోలు అసెంబ్లీ అభ్యర్థి కందుల దుర్గేష్‌ను బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి శనివారం పరామర్శించారు. దుర్గేష్ మాతృమూర్తి పద్మావతి శుక్రవారం మృతి చెందారు. ఈ వార్త తెలుసుకున్న పురందేశ్వరి, ఆమె భర్త దగ్గుబాటి వెంకటేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాశీ విశ్వనాథరాజు, ముఖ్య అధికార ప్రతినిధి లంకా దినకర్ తదితరులతో కలిసి వెళ్లి దుర్గేష్‌ను, వారి కుటుంబ సభ్యులను కలిసి సంతాపం తెలిపారు.

10 సెల్‌ఫోన్లు రికవరీ చేసిన జీఆర్పీ

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): చోరీకి గురైన 10 సెల్‌ఫోన్లను ప్రభుత్వ రైల్వే పోలీసులు రికవరీ చేశారు. సీఐ విజయ్ శంకర్ వివరాల ప్రకారం.. బాధితుల ఫిర్యాదుల ఆధారంగా సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ వెబ్‌సైటు ద్వారా దొంగతనానికి గురైన రూ.2లక్షల విలువ చేసే 10 సెల్‌ఫోన్లను రికవరీ చేసి వాటి యజమానులకు అప్పగించారు. రికవరీలో ప్రత్యేక శ్రద్ధ చూపిన సిబ్బందిని డీఎస్ఆర్పీ ఎల్.మోహనరావు అభినందించారు. కార్యక్రమంలో ఎస్ఐలు మావుళ్లు, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

25న ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ అడ్మిషన్ టెస్ట్

జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు

రాజమహేంద్రవరం రూరల్, ఏప్రిల్ 20: ఈనెల 25న ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ అడ్మిషన్ టెస్టు, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీ, డిగ్రీ కళాశాల కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నట్టు జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు తెలిపారు. ఏపీ ఆర్ఎస్ క్యాట్-2024, ఏపీఆర్జేసీ అండ్ డిగ్రీ సెట్-2024పై శనివారం సాయంత్రం డీఆర్వో చాంబర్‌లో సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ పరీక్షలు రెండు సెషన్స్‌లో జరుగుతాయన్నారు. ఏపీఆర్ఎస్ క్యాట్-2024 ఆరు కేంద్రాల్లోను ఉదయం 10 నుంచి 12గంటల వరకు జరుగుతుందని తెలిపారు. రెండో సెషన్ 3 కేంద్రాల్లో ఏపీ ఆర్జేసీ అండ్ డిగ్రీసెట్-2024 పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5గంటల వరకు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే హాల్ టిక్కెట్స్ పంపించామన్నారు. పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు, ఆర్ఎంసీ తాగునీరు, వసతి, శానిటేషన్ నిర్వహణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద సెక్షన్ 144 అమలు చేయాలని ఆదేశించారు. అలాగే ఈనెల 27న జిల్లాలోని 11 కేంద్రాల్లో పాలిటెక్నిక్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తున్నామని, ఉదయం 11నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పరీక్ష జరుగుతుందని, జిల్లాలో 5,844 మంది పరీక్షలకు హాజరవుతారని డీఆర్వో పేర్కొన్నారు.

ఆరికిరేవులలో బంగారం చోరీ

కొవ్వూరు, ఏప్రిల్ 20: తాళం వేసి ఉన్న ఇంటి తలుపులు తెరచి కాసున్నర బంగారపు గొలుసు దొంగిలించుకుపోయిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు హెడ్ కానిస్టేబుల్ చంద్రాల బాబూరావు తెలిపారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామానికి చెందిన మల్లిపూడి సుబ్బారావు ఈ నెల 14న ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో పాటు కూలిపనికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి తిరిగొచ్చేసరికి తలుపులు తెరచి ఉండడంతో కంగారుగా లోపలికి వెళ్లి చూడగా కాసున్నర విలువగల బంగారు గొలుసు చోరీకి గురైనట్టు గుర్తించారు. వెతికినా కనిపించకపోవడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

జనసైనికులు సత్తా చాటాలి: అచ్చిబాబు

కూటమి అభ్యర్థులకు మద్దతుగా పలువురి ప్రచారం



పెరవలి: అజ్జరంలో ప్రచారం నిర్వహిస్తున్న కార్యకర్తలు

కొవ్వూరు, ఏప్రిల్ 20: రాష్ట్ర భవిష్యత్తుకై చేస్తున్న యుద్ధంలో జనసైనికులు సత్తా చాటాలని టీడీపీ సీనియర్ నాయకుడు, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు) అన్నారు. శనివారం మండలంలోని పంగిడి గ్రామంలో జనసైనికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. చౌటిపల్లి శివ, జనసేన నాయకులను కలిసి సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరిల విజయానికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో డేగల రాము, గంగుమళ్ళ స్వామి, కన్నాజి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెరవలి: కూటమి నియోజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్‌కు, రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరికి మద్దతుగా అజ్జరంలో ఇంటింటికీ ప్రచారం నిర్వహించారు. గాజు గ్లాస్ గుర్తుపైన, కమలం గుర్తుపైన ఓట్లు వేసి గెలిపించాలని ప్రచారం చేశారు. రాబోయే ఉమ్మడి ప్రభుత్వంలో చేయనున్న సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు: తెలుగుదేశం పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు మెరుగైన సంక్షేమ పథకాలు అందుతాయని టీడీపీ నాయకులు ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కరుటూరి సతీష్ అన్నారు. శనివారం స్థానిక దానవయ్యిపేటలో ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఒక ఓటు సైకిల్ గుర్తుపైన, మరో ఓటు కమలం గుర్తుపైన వేసి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. పెన్షన్ రూ.4 వేలుకు పెంచుతామని, గ్రామాలను అభివృద్ధి చేస్తామని, ప్రజల ఇబ్బందులు పోవాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేతా సహెబ్, రామకృష్ణ, కోడి చంటియ్య, ఆళ్ళ సూర్యప్రకాశరావు, జొన్నకూటి వెంకాయమ్మ, సయ్యద్ అన్వర్ బాషా, అల్తాఫ్, కోడూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయంపై నిఘా పెట్టాలి

జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు రోహిత్‌నగర్



కొవ్వూరు, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థుల ప్రచారం, ర్యాలీలు, ఖర్చులపై క్షేత్రస్థాయిలో మరింత నిఘా పెట్టాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రోహిత్ నగర్ అన్నారు. శనివారం కొవ్వూరు సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవతో ఆయన సమావేశమయ్యారు. ఎన్నికల్లో అభ్యర్థుల ఖర్చులు, ప్రచారాలు, ర్యాలీ లపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆయా సందర్భాల్లో పూర్తిస్థాయిలో వీడి యో రికార్డింగ్ చేసి, వాటిని ఎప్పటికప్పుడు హార్డ్‌డిస్క్‌లో భద్రపరిచేలా ఏర్పా ట్లు చేయాలన్నారు. ర్యాలీలపై రాజకీయ పార్టీల నాయకులు ప్రత్యారోపణలు చేస్తారని, వాటిని సమర్థవంతంగా నిజ నిర్ధారణ చేయడంలో వీడియో క్లిప్‌లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఆ దిశగా కార్యాచరణ రూపొందించాలని రోహిత్‌నగర్ చెప్పారు.

రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

కొవ్వూరు, ఏప్రిల్ 20: ఎదురెదురుగా రెండు వాహనాలు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడినట్టు హెడ్‌కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. రాజానగరం గ్రామానికి చెందిన పలివెల కరుణకుమార్ భద్రాచలం వెళ్లి ఈ నెల 19న బైక్‌పై తిరిగి వస్తున్నాడు. మార్గ మధ్యలో రాత్రి 10:30 గంటల సమయంలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి టోల్‌గేట్ సమీపానికి చేరుకునే సరికి ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో కరుణకుమార్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రథమచికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనం నడుపుతున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. కరుణకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

రాష్ట్రాన్ని జగన్ అప్పుల ఊబిలోకి నెట్టేశాడు

ఇంటింట ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి వాసు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: సంపద సృష్టించడం చేతకాని జగన్ ఈ రాష్ట్రాన్ని అప్పులు ఊబిలో నెట్టేశాడని ఇటువంటి వాడి అవసరం రాష్ట్రానికి లేదని టీడీపీ-జనసేన-బీజేపీ రాజమహేంద్రవరం సిటీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. రాజమహేంద్రవరం 13వ డివిజన్‌లో డైమండ్ పార్కు ప్రాంతంలో శనివారం టీడీపీ అంగన్‌వాడీ కమిటీ అధికార ప్రతినిధి కప్పల వెలుగుకుమారి, నగరబోయిన రామకృష్ణ, బొర్రా చిన్ని, రాయి అప్పన్నబాబు స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో శ్రీనివాస్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు. ఈ సందర్భంగా మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ఒక్కసారి అవకాశం ఇచ్చిన పాపానికి రాష్ట్రాన్ని 25 ఏళ్ల వెనక్కి తీసుకుపోయిన ఘనుడు జగన్ అని అన్నారు. రాష్ట్రాన్ని దోచుకుని, అందిన కాడికి అప్పులు చేసి అగాధంలోకి రాష్ట్రాన్ని నెట్టివేశాడన్నారు. సంక్షేమ పథకాలు ప్రజలు ఇస్తున్నానని సవాలక్ష నిబంధనలు పెట్టి కోతలు పెట్టాడని అంతే కాకుండా రూ.10 ఇచ్చి దొడ్డి దారిన రూ.100 లాగేశాడన్నారు. సంపద సృష్టించడం చేతకాదు, పరిశ్రమలు తీసుకురావడం చేతకాని వాడు పాలనకు పనికి రాడన్నారు. ఇక ప్రతి పనిలోను 25శాతం కమిషన్‌తో ప్రజాధనాన్ని దోచిన భరత్‌రామ్‌కు ప్రజాప్రతినిధిగా వుండే అర్హత లేదన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన వాడిని ఎమ్మెల్యేగా చేయకూడదని ప్రజలు ఫిక్స్ అయ్యారన్నారు. భరత్‌రామ్‌కు ఓటమి తప్పదని ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు.

రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థిగా మేడా శ్రీనివాస్ నామినేషన్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా రాజమహేంద్రవరం అసెంబ్లీ నియోజకవర్గానికి రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థిగా ఆ పార్టీ వ్యవస్థాపకుడు మేడా శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. శనివారం ఆర్యాపురంలోని పార్టీ కార్యాలయం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఊరేగింపుగా ఆర్వో కార్యాలయానికి చేరుకుని రిటర్నింగ్ అధికారికి నామినేషన్‌ను దాఖలు చేశారు. కార్యక్రమంలో ఈ పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.850 కోట్ల విరాళం క్విడ్‌ప్రోకో కాదా

● బీజేపీతో దేశం అన్ని రంగాల్లో వెనుకబాటు ● కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: ఎలక్ట్రోల్ బాండ్ల పేరిట ఆరువేల కోట్లు బీజేపీ దోచుకుందని, 250 కోట్ల బ్యాలెన్స్ షీట్ చూపిన కంపెనీ రూ850 కోట్లు విరాళం ఇచ్చిందంటే దీని అర్థం క్విడ్ ప్రోకో కాదా అని రాజమహేంద్రవరం కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. రాజమహేంద్రవరంలోని పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ పదేళ్ల పాలనలో దేశం అన్నిరంగాల్లోను వెనుకబడిందన్నారు. వీరు చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. నోట్ల రద్దు అట్టర్ ఫ్లాప్ అయ్యిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టు, ఆర్వోబీలు, నన్నయ యూనివర్సిటీ ఏర్పాటు, గామన్ బ్రిడ్జి నిర్మాణం వంటి అనేక అభివృద్ధి పనులు చేసిందన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేదని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. గతంలో చంద్రబాబు నిజస్వరూపం గురించి ఒక చరిత్ర-కొన్ని నిజాలు పేరిట డాక్టర్ దగ్గుబాటి వెంకటేశ్వరరావు రాసిన పుస్తకం ప్రసావించి అంశాల మాటేమిటని ప్రశ్నించారు. ఆ పుస్తకంలో చంద్రబాబు గురించి చెప్పింది నిజమా కాదా, నిజమైతే ఇప్పుడు ఎలా పొత్తు పెట్టుకున్నారో చెప్పాలన్నారు. ఓట్లు వేసే ప్రజలు అభ్యర్థుల నిజస్వరూపాలు తెలుసుకోవాలన్నారు. ఈ దేశానికి, రాష్ట్రానికి న్యాయం జరగాలంటే, ప్రత్యేక హోదా రావాలంటే, పోలవరం పూర్తి కావాలన్నా కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఎంపీగా తనను, ఎమ్మెల్యే అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలన్నారు. ఈనెల 22న తాను నామినేషన్ వేస్తున్నానని కాంగ్రెస్ పార్టీ ప్రముఖనేత రఘువీరారెడ్డి హాజరౌతారని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధర్, రాజానగరం అభ్యర్థి ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రం బాగుపడాలంటే కూటమిని గెలిపించాలి

» టీడీపీ, జనసేన, బీజేపీ కొవ్వూరు ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి



ఆరికిరేవులలో కేక్ కట్ చేస్తున్న ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, ఏప్రిల్ 20: రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలంటే టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం ఆరికిరేవుల గ్రామంలో శనివారం ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంత కుముందు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల మధ్య ముప్పిడి వెంకటేశ్వరరావు కేక్ కట్‌చేశారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు, బీసీ డిక్లరేషన్, మెగా డీఎస్సీ, వలంటీర్ల వేతనం రూ.10 వేలకు పెంపు వంటి పథకాలను ఇంటింటా ప్రచారం చేశారు. గ్రామంలోని యువకులతో కొద్దిసేపు వాలీబాల్ ఆడారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వట్టికూటి వెంకటేశ్వరరావు, చావా శ్రీనివాస్, గుత్తా రమణ, డేగల రాము, గంగుమళ్ళ స్వామి, పాలడుగుల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి

రాజకీయ పరిశీలకులు కృష్ణ, వినయ్

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20: రాష్ట్రంలో జగన్ పరిపాలనపై ప్రజలందరు విసుగు చెంది అసంతృప్తితో ఉన్నారని రాజకీయ పరిశీలకులు గంధం కృష్ణ, పుప్పాల వినయ్ అన్నారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ప్రజలు నమ్మి ఓట్లు వేసి అధికారం ఇచ్చినందుకు ఐదేళ్ళలో పనికిరాని సలహాదారులకు లక్షల జీతాలు ఇచ్చి ఒక్కటీ పనికోచ్చేపని చేయలేదన్నారు. జగన్ పుణ్యమంటూ రాష్ట్రం 20 ఏళ్ల వెనక్కిపోయిందన్నారు. ఉపాధి లేక యువత పెడదారి పడుతున్నారన్నారు. గంజాయి, డ్రగ్స్‌కు కేంద్రంగా రాష్ట్రాన్ని మార్చేసాడన్నారు. విశాఖను ఎందుకు రాజధాని అంటున్నాడో డ్రగ్స్ కంటైనర్ పట్టుబడేవరకు అర్థం కాలేదన్నారు. చీప్‌లిక్కరు, కల్తీ మద్యంతో ప్రజల ఆరోగ్యాలతో ఆటలాడుకున్నారని కృష్ణ, వినయ్ అన్నారు. నిజంగా జగన్ అభివృద్ధి చేసివుంటే ఈ రోజు బస్సు యాత్రలు చేయాల్సిన అవసరం లేదన్నారు. సీపీఎస్ రద్దుచేయలేదని, డీఎస్సీ లేదని నవరత్నాలు రాలిపోయాయని, ప్రజలను నట్టేట ముంచాడని అన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్ 1	లవ్‌గురు
వై.స్క్రీన్ 2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	డీజే టిల్లు-2
రాధాకృష్ణ	ఫ్యామిలీ స్టార్
శ్రీగణపతి	మంజుమ్మల్ బాయ్స్

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి